# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

28.12.2025
ఆదివారం Sunday

సంపుటి (volume): 1
సంచిక (Issue): 177

పేజీలు : 8
Pages : 8

వెల రూ.2.00

Published from : Hyderabad
Circulated to : Telangana



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789


# చలి పంజా

## తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి



- పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- 31వరకు తీవ్రమైన చలి పరిస్థితులు
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

**హైదరాబాద్, డిసెంబరు 27:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత రోజురోజుకూ ప పెరుగుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దీంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గత పదేళ్లలో ఎక్కువ రోజులు తీవ్రమైన చలి కమ్ముకున్నది ఈసారి శీతాకాలంలోనే అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దాదాపు నెల రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా తక్కువగా నమోదవుతున్నాయి. ఉమ్మడి మెదక్, ఆదిలాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఆరేడు డిగ్రీలకు పడిపోతున్నాయి. హైదరాబాద్‌లోనూ ఈసారి చలి తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. ఇంట్లో వెచ్చగా, బయట చలిగా ఉంటే.. ఆ తర్వాత ఇంట్లో చలి వేస్తోంది, బయటికెళితే మాత్రం కాస్త ఉపశమనం అనిపిస్తోంది. శీతల గాలులు, మన ఇళ్ల గోడలే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. ఉత్తర వాయవ్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. దీనితో ఇళ్ల కాంక్రీటు గోడలు, శ్లాబులు రాత్రంతా చల్లబడి చలి పెరుగుతోంది. ఇళ్ల గోడలు, శ్లాబ్ నుంచి రోజంతా చల్లదనం వెలువడుతోంది.

మిగతా 3 లో



4

## పాక్‌తో అప్రమత్తంగా ఉండాల్సిందే

పాక్ సైనిక వ్యూహాలను తేలికగా తీసుకోరాదు

కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ వ్యాఖ్యలు



## మాసబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసు దర్యాప్తు

పరారీలో నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్

మాసబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. మాసాబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసులో ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం ఈగల్ టీమ్, పోలీసులు గాలిస్తున్నారు. 3



## ఏడాది తరువాత పోలీసుల చార్జ్‌షీట్

- సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో 23మందిపై అభియోగాలు..
- ఏ11గా నటుడు అల్లు అర్జున్

3



## నకిలీ ఏజెంట్ల మాటలు నమ్మకండి

- దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక
- ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా

4



2

## డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?

- అకున్ సబర్వాల్‌ను తిరిగి నియమించండి
- మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌ను విచారించండి
- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై బండి సంజయ్ ఆగ్రహం

## జర్నలిస్టుల అరెస్ట్ దారుణం



కాంగ్రెస్ ఏడో గ్యారెంటీ ఇదేనా

ప్రభుత్వం తీరుపై మండిపడ్డ కేటీఆర్

ప్రజల గొంతుక అయిన జర్నలిస్టులను అరెస్టు చేయడం, నిర్బంధించడం కాంగ్రెస్ నిరంకుశత్వానికి నిదర్శనమని.. ప్రజాస్వామిక పరిరక్షణ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన 7వ గ్యారంటీ ఇదేనా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

## పంచాయతీ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్ మాత్రమే!

- సెమీ ఫైనల్ ఫైనల్ ఎన్నికలు ముందున్నయ్
- పంచాయతీలకు మీ అబ్బ సొమ్ము ఇవ్వడం లేదు
- మహబూబాబాద్ సర్పంచ్‌ల సభలో కేటీఆర్

2




3

## ఐఏఎస్‌లకు కేంద్రం వార్నింగ్

వివరాలు సమర్పించకపోతే చర్యలు

కేంద్ర, రాష్ట్ర సెక్రటరీలకు ఆదేశాలు

## పేదల కడుపుపై తన్నిన మోదీ

- దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి ముప్పు
- ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు నష్టం
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే

4






## మహిళా కమిషన్ విచారణకు నటుడు శివాజీ

తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన నటుడు

కావాలనే కొందరు దుష్ప్రచారంపై ఆగ్రహం


వివరాలు 3వ పేజీలో

## పేద పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

- గండిపేట రాజకీయ నేతల శిక్షణ కేంద్రం
- ఎన్టీఆర్ ట్రస్ట్ వార్షికోత్సవంలో చంద్రబాబు



3



4

## వెచ్చదనం కోసం ఇంట్లో నిప్పుల కుంపటి

అర్ధరాత్రి వేళ విష వాయువులకు నలుగురు మృతి



## సిద్దిపేట జిల్లాలో పులి సంచారం

అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక

3



# దళితుల భూమిని దౌర్జన్యంగా లాక్కుంటారా

## దుందిబీ నదిలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల ఇసుకదోపిడీ

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**నాగర్ కర్నూల్ ,డిసెంబరు 27:** మెడికల్ కాలేజీకి 40 ఎకరాల దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కాంట్రాక్టర్లకు అడ్వాన్స్‌డ్ కల్చర్‌ని సీఎం రేవంత్‌రెడ్డి తీసుకువచ్చారని ఆక్షేపించారు. దుందిబీ నదిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు పోటాపోటీగా ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపణలు చేశారు. ఈమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిది డైవర్షన్, కరప్షన్ పాలన అని విమర్శలు చేశారు. శనివారం నాగర్ కర్నూలు జిల్లాలోజాగృతి జనం బాటలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. అభివృద్ధి అవకాశాలు అందరికీ సమానంగా రావాలని సూచించారు. సామాజిక తెలంగాణ సాధనకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని పరుగులు పెట్టించినట్లుగా పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. నల్ల మట్టి తీసేందుకు రైతుల వద్ద తీసుకున్న900 ఎకరాల భూమిని వారికి వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో డిండి ప్రాజెక్ట్‌కి నీటిని తరలించలేదని.. ప్రభుత్వం మారిన కూడా ఇంకా సర్వేలే జరుగుతున్నాయని కవిత విమర్శించారు.

# జర్నలిస్టుల అక్రమ అరెస్టులు ఆపాలి

## వారిని వెంటనే విడుదల చేయాలి: హరీశ్ రావు



**హైదరాబాద్, డిసెంబరు 27 :**రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల అక్రమ అరెస్టులను బీఆర్ఎస్ పార్టీ తరపున మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. డెస్క్ జర్నలిస్ట్‌ల న్యాయమైన పోరాటానికి తమ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. 'జీవో 252 సవరణను డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్న జర్నలిస్ట్‌లను అక్రమ అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నాం. స్తున్నాం. జర్నలిస్టులకు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 26,000 అక్రిడిటేషన్ కార్డు లు ఇచ్చారు. రిపోర్టింగ్ జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు అనే బేధం లేకుండా అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చారు కేసీఆర్. కానీ, రేవంత్ రెడ్డి అక్రిడిటేషన్ కార్డులను 10 వేలకు తగ్గిస్తామని చెప్పడం దుర్మార్గం. డెస్క్ జర్నలిస్ట్‌లకు జరుగుతున్న ఈ అన్యాయాన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం. సోషల్ మీడియా, యూట్యూబ్ జర్నలిస్టులను టెర్రరిస్టులుగా పోల్చడం దారుణం. జర్నలిస్టుల పోరాటానికి బీఆర్ఎస్ పూర్తిగా మద్దతు తెలుపుతుంది. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో జర్నలిస్టుల తరపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం' అని ఎమ్మెల్యే వెల్లడించారు.

# నకిలీ గాంధీల మాటలు నమ్మరు

## గాంధీల పేరుతో ఎన్ని పథకాలు ఉన్నాయో చెప్పాలి

## బంగ్లా హిందువుల ఊచకోతపై కాంగ్రెస్ ఎందుకు మాట్లాడదు

## మెదక్ బిజెపి ఎంపి రఘునందన్ రావు విమర్శలు



**హైదరాబాద్, డిసెంబరు 27:** దేశంలో నకిలీ గాంధీల మాటలు ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ పేరు లేకుంటే నకిలీ గాంధీలకు మనుగడ ఉండదని భయపడుతున్నారని విమర్శించారు. మహాత్మాగాంధీపై సోనియాగాంధీ కుటుంబానికి చిత్తశుద్ధి ఉంటే వారి హయంలో గాంధీ పేరుతో ప్రవేశ పెట్టిన పథకాల శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 150 పథకాల్లో రెండు, మూడు పథకాలు మాత్రమే కాంగ్రెస్ గాంధీ పేరు పెట్టిందని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగే హింసపై కాంగ్రెస్ కనీసం ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు రఘునందన్ రావు. 'తండ్రి ఈవీఎంలు ప్రవేశపెడితే కొడుకు దాన్ని వ్యతిరేకిస్తాడు. మీరు గెలిస్తే ఈవీఎంలు పని చేస్తున్నట్లా.. మేము గెలిస్తే పని చేయనట్లా?. ఇదెక్కడి సంస్కృతి ? రాహుల్ గాంధీకి తండ్రి అంటే గౌరవం, విశ్వాసం లేదు. ముక్కలైన కాంగ్రెస్.. దేశాన్ని ముక్కలుగా చేయాలని చూస్తోంది. గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు , కంప్యూటర్ ఆపరేటర్‌లకు తప్ప రాష్ట్ర ప్రభుత్వం ఇంకెవరికి పైసలు ఇవ్వదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రూపాయి అందడం లేదు. లోకల్ అడ్మినిస్ట్రేషన్ అనే పదానికి అర్థం లేకుండా కాంగ్రెస్ చేసింది. గతంలో కాంగ్రెస్ సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. మల్లికార్జున ఖర్గే ముందు.. మీ సొంత రాష్ట్రంలో పంచాయతీ చూసుకోండి. అక్కడ రేపు ఎన్నికలు వస్తే ఏమవుతుందో అది చూసుకోండి' అని రఘునందన్ రావు విమర్శించారు.

# డ్రగ్స్ కేసులో నిర్లక్ష్యం ఎందుకు?

- అకున్ సబర్వాల్‌ను తిరిగి నియమించండి
- మాజీ సీఎస్ సోమేశ్ కుమార్‌ను విచారించండి
- రాష్ట్ర ప్రభుత్వం తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆగ్రహం



**హైదరాబాద్, డిసెంబరు 27:** రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ కేసులను తీవ్రంగా పరిగణించడంలేదని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పండుగలు, నూతన సంవత్సర వేడుకల సమయంలోనే డ్రగ్స్ కేసుల నమోదుకు పరిమితమవుతున్నారని ఆక్షేపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో జరిపిన 'డ్రగ్స్ కేసు' విచారణ నివేదికపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈమేరకు డ్రగ్స్ కేసులపై బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పండుగల అప్పుడే డ్రగ్స్ కేసులు నమోదు చేస్తారా? అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ ఆధ్వర్యంలో నాటి డ్రగ్స్ కేసు విచారణ ఏమైంది? అని నిలదీశారు. అనేకమంది సెలబ్రిటీల పేర్లు బయటకు వచ్చాయి కదా? ఏం చేశారని ప్రశ్నించారు. తమతోపాటు కేసీఆర్ కుటుంబ సభ్యులు కూడా డ్రగ్స్ తీసుకున్నారని.. గతంలో నిందితులు వాంగ్మూలం ఇచ్చారు కదా అని గుర్తుచేశారు. శనివారం హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడారు బండి సంజయ్. నిందితుల వాంగ్మూలం ఆడియో, వీడియో రికార్డు చేశారని తెలిపారు. తమ కుటుంబ సభ్యుల భవిష్యత్ నాశనమవుతుందనే భయంతోనే.. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ కేసు నీరుగార్చారని ఆరోపించారు. అకున్ సబర్వాల్‌ను డ్రగ్స్ కేసు నుంచి ఎందుకు తప్పించారని ప్రశ్నించారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, వీడియో స్టేట్‌మెంట్స్‌ను నాటి సీఎస్ సోమేశ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారని ప్రస్తావించారు. గతంలో సేకరించిన ఆధారాలు ఏమయ్యాయని నిలదీశారు. ఈ విషయంలో సోమేశ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని అన్నారు. డ్రగ్స్ కేసులో ఈగల్ టీమ్ లీగల్‌గా విధులు నిర్వహిస్తోందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈగల్ టీమ్‌లో కొంతమంది డ్రగ్ పెడ్లర్లతో రాజీపడుతున్నారని ఆరోపణలు చేశారు. అకున్ సబర్వాల్‌కి తిరిగి డ్రగ్స్ కేసు బాధ్యతలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. నాటి డ్రగ్స్ కేసులో అనేక మంది బడా వ్యక్తులు, సినీ ప్రముఖులు ఉన్నారు. పట్టుబడిన వాళ్లను అకున్ సబర్వాల్ టీం నాడు విచారణ చేస్తే.. ఆ వాంగ్మూలంతో కూడిన ఆడియో, వీడియో రికార్డులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. అదే సమయంలో ఆ కేసుపై అకున్ సబర్వాల్ టీం రూపొందించిన నివేదిక, రికార్డు చేసిన ఆడియో, వీడియో, స్టేట్‌మెంట్లన్నింటినీ నాటి సీఎస్ సోమేశ్ కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత డ్రగ్స్ కేసును పూర్తిగా నీరుగార్చారు. అకున్ సబర్వాల్ సేకరించిన ఆధారాలు, ఆడియో, వీడియో రికార్డులు, స్టేట్ మెంట్లను సోమేశ్ కుమార్ తదుపరి విచారణ టీమ్‌కు అప్పగించలేదు.. వాటిని కోర్టుకు స్వాధీనం చేయలేదు.కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా డ్రగ్స్ నిర్మూలనపై చిత్తశుద్ధి ఉంటే సీఎం ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఈగల్ టీమ్ వెంటనే రంగంలోకి దిగి సోమేశ్ కుమార్‌ను విచారించాలని అన్నారు. ఈగల్ టీమ్‌లో సమర్థులైన అధికారులు ఉన్నప్పటికీ, ఒకరిద్దరు మాత్రం డ్రగ్స్ పెడ్లర్లతో రాజీపడుతున్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరుగుతున్న డ్రగ్స్ విక్రయాలపై ఉక్కుపాదం మోపాలంటే.. అకున్ సబర్వాల్ వంటి సమర్థులైన అధికారులకు తిరిగి 'డ్రగ్స్ కేసు' విచారణ బాధ్యతలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

# పంచాయతీ ఎన్నికలు క్వార్టర్ మాత్రమే..

- సెమీ ఫైనల్ ఫైనల్ ఎన్నికలు ముందున్నయ్
- పంచాయతీలకు మీ అబ్బ సొమ్ము ఇవ్వడం లేదు
- గ్రామాలను పడావు పెట్టిన ఘనత రేవంత్‌ది
- మళ్లీ కేసీఆర్ సీఎం కావాలన్నదే జనం మాట
- ఒక్క భాషలో తిడితే.. మూడు భాషల్లో తిడుతా
- మహబూబాబాద్ సర్పంచ్‌ల సభలో కేటీఆర్ ఎదురుదాడి



**మహబూబాబాద్, డిసెంబరు 27:** రాష్ట్రంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలు క్వార్టర్ ఫైనల్ మాత్రమేనని, సెమీ ఫైనల్, ఫైనల్ పోటీలు ముమ్ముందు ఉన్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా కూడా అద్భుత ఫలితాలు సాధించాలని సూచించారు. మహబూబాబాద్‌లో సర్పంచ్‌లో సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలె, కేసీఆర్ మళ్లీ సీఎం కావాలె' అన్నది మనందరి కోరిక, ఈ రాష్ట్ర ప్రజల అందరి కోరిక అని చెప్పారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలే సెమీఫైనల్. ఆ తర్వాత 2028 అసెంబ్లీ ఎన్నికలు ఫైనల్ అన్నారు. ఈ అన్ని దశల్లో అద్భుత ఫలితాలు సాధిస్తూ ఫైనల్‌లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలన్నదే మనందరి కోరిక. ఈ రాష్ట్ర ప్రజల అందరి కోరిక. ఎందుకంటే పాడై పోయిన వ్యవసాయాన్ని బాగుచేసింది కేసీఆర్. రైతులకు రైతుబంధు ఇచ్చింది కేసీఆర్' అని గుర్తుచేశారు. గ్రామ పంచాయతీలకు ఫైనాన్స్ కమిషన్ ఇచ్చే నిధులు ఎవని అత్త సొమ్ము కాదని కేటీఆర్ అన్నారు. మీ పంచాయతీకి నిధులు ఇవ్వం అని బెదిరిస్తారని, ఆ నిధులు ఎవని అబ్బ సొత్తో, అత్త సొమ్మో కాదని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచి వచ్చిన సర్పంచ్ సోదరులారా.. ఇప్పుడు మీ మీద ఒత్తిడి ఉంటది. మీ ఎమ్మెల్యే మీకు నిధులు ఇయ్యనంటడు. మీకు ఇందిరమ్మ ఇళ్లు ఇయ్యనంటడు. మిమ్మల్ని ఇబ్బంది పెడుతడు. కానీ నేను ఒక్కటే చెబుతున్నా.. మీమీ గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు ఎవరి అబ్బ సొత్తో, ఎవరి అత్త సొమ్మో కాదు. అది ప్రభుత్వ సొమ్ము' అని చెప్పారు. గ్రామంలో మీదే పవర్. పంచాయతీకి వచ్చే నిధులను ఏ ఎమ్మెల్యే, ఏ ఎంపీ అడ్డుకోలేడు. అడ్డుకునే ప్రయత్నం చేసినా అది చెల్లదని తెలిపారు. 'రేవంత్‌రెడ్డీ.. నీకు నేను ఒక్కటే చెబుతున్నా. నీకు ఒక్క భాష మాత్రమే వచ్చు. నాకు 3 భాషలు వచ్చు. నువ్వు తిట్టాలనుకుంటే ఒక్కటే భాషల తిడుతవ్. నేను తలుచుకుంటే నిన్ను మూడు భాషలల్ల తిడుత ఏమనుకుంటున్నవో అని హెచ్చరించారు.. ఇక్కడున్న మా అక్కలను, అన్నలను అడిగి గోర్మాటి భాషల కూడా తిడుత. లంబాడ సోదరుల భాష నేర్చుకుని అండ్ల గూడా తిడుత అన్నారు.

# జర్నలిస్టుల అరెస్ట్ దారుణం

## కాంగ్రెస్ ఏడో గ్యారెంటీ ఇదేనా

## ప్రభుత్వం తీరుపై మండిపడ్డ కేటీఆర్

**హైదరాబాద్, డిసెంబరు 27:**ప్రజల గొంతుక అయిన జర్నలిస్టులను అరెస్టు చేయడం, నిర్బంధించడం కాంగ్రెస్ నిరంకుశత్వానికి నిదర్శనమని.. ప్రజాస్వామిక పరిరక్షణ అంటూ కాంగ్రెస్ ఇచ్చిన 7వ గ్యారంటీ ఇదేనా? అని కేటీఆర్ ప్రశ్నించారు. జర్నలిస్టుల సమస్యలపై శాంతియుతంగా వినతి పత్రాలు ఇచ్చేందుకు వెళ్లిన జర్నిలిస్ట్ నేతలను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది కేవలం నేతల అరెస్టు మాత్రమే కాదని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే జర్నలిస్టుల గొంతును పోలీసు బలగాలతో నొక్కేసే కుట్ర అని ఆయన విమర్శించారు. కొత్త జీవో సాకుతో జర్నలిస్టుల అక్రిడిటేషన్లలో కోత విధించడం ద్వారా ప్రభుత్వం వారి ప్రాథమిక హక్కులను కాలరాస్తోందని, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడం నిరంకుశత్వానికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజలను మభ్య పెట్టేందుకు వచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ప్రజాస్వామిక పరిరక్షణ పేరుతో ఇచ్చిన ఏడవ గ్యారెంటీ అంటే జర్నలిస్టులను అరెస్టు చేయడమేనన్నారు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమించే జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్లు మంజూరు చేయాల్సింది పోయి, ఉన్న వాటిని తొలగించడం ద్వారా ప్రభుత్వం వారి ఉపాధిని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్ట్ ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని అన్నారు. మారుతి సాగర్, రమేశ్ హజారి, యోగానంద్, విష్ణువర్ధన్ రెడ్డి, రమణ కుమార్, కడకంచి వెంకట్ వంటి కీలక నేతలను అరెస్ట్ చేయడం దారుణం అన్నారు. జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను, నిర్బంధాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ, అక్రిడిటేషన్ల పునరుద్ధరణ కోసం సాగే పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# ఇష్టానుసారంగా జీహెచ్ఎంసీ డీలిమిటేషన్

## రాజకీయ పార్టీల అభిప్రాయాలకు విలువలేదా : తలసాని



**హైదరాబాద్, డిసెంబరు 27:** జిహెచ్ఎంసిలో డీలిమిటేషన్ పేరుతో ప్రభుత్వం, అధికారులు ఇష్టానుసారంగా డివిజన్లు ఏర్పాటు చేశారని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమన్నారు. దీనిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా, కౌన్సిల్ సమావేశాల్లో అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోలేదని విమర్శించారు. హడావుడిగా డివిజన్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో ఎవరికి అర్థం కావడం లేదన్నారు. ఇకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాటతీరు మార్చుకోవాలని, స్థాయికి తగినట్లు హుందాగా వ్యవహరించాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హితవు పలికారు. శనివారం సికింద్రాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో 19 మంది లబ్దిదారులకు షాదీముబారక్ (15), కళ్యాణ లక్ష్మి (4) ఆర్థిక సాయం చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకుండా వాటిని ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు ఎప్పుడు నిర్మిస్తారని పేదలు అడుగుతున్నారని వీటికి సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్లు టి.మహేశ్వరి, దీపికా, తహసీల్దార్ పాండు నాయక్, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హరికృష్ణ, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు పాల్గొన్నారు.

# పశుసంవర్ధక రంగ అభివద్ధికి పెద్దపీట



**జగిత్యాల, డిసెంబరు 27:** రాష్ట్ర ప్రభుత్వం పశుసంవర్ధక రంగ అభివద్ధికి పెద్దపీట వేస్తోందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. పాడి రైతులకు అండగా నిలిచిందన్నారు. శనివారం నక్కలపేటలో నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల్లో నట్టల నివారణకు ప్రభుత్వం రూ. 4,43,70,974 ఖర్చు చేస్తుందన్నారు. వ్యాధులు తగ్గి జీవాల మరణాలు అదుపులో ఉంటాయన్నారు. రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో పశుపోషకుల సంక్షేమం కోసం మరిన్ని పథకాలు అమలు చేయనున్నట్లు హామీ ఇచ్చారు. వ్యవసాయానికి అనుబంధంగా పాడి, గొర్రెల పెంపకం చేపట్టాలన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో పెరిగిన చలి

మొదటి పేజీ తరువాయి




దీనితో ఇంట్లో చలివేస్తోంది. పై అంతస్తు, ఆపైన ఉండే వారికి శీతలగాలుల ప్రభావంతో మరింత ఎక్కువగా చలి ఉంటోంది. మరోవైపు ఆకాశంలో మేఘాలు లేకపోవడంతో, గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుండటంతో సూర్యకిరణాలు నేరుగా దూసుకొస్తున్నాయి. సూర్యాస్తమయం వరకు ఈ ప్రభావం ఉంటోంది. తర్వాత మళ్లీ బయట చలిపెరుగుతోంది. ఇళ్లలో వెచ్చగా ఉంటోంది. హెచ్‌సీయూ, పటాన్‌చెరు, గచ్చిబౌలి, రాజేంద్రనగర్ వంటి శివారు ప్రాంతాల్లో 6-8 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.తెలంగాణలో జనవరి రెండో వారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు 13 డిగ్రీలు, ఆపైన నమోదవుతాయని వాతావరణ వివరాలు, ముందస్తు అంచనాలు అందించే 'స్కైమెట్ ' వెబ్‌సైట్ అంచనా వేసింది. మరో వాతావరణ వెబ్‌సైట్ ఆక్యువెదర్.. జనవరి తొలివారం తర్వాత చలి నుంచి ఉపశమనం ఉంటుందని, నెలాఖరుకల్లా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-19 మధ్యకు చేరుతాయని పేర్కొంది. ఈనెల 31వరకు తీవ్రమైన చలి పరిస్థితులు కొనసాగుతాయని.. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరో 3-4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ నిపుణులంతా చెబుతున్నారు. సాధారణంగా 12 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు కాంక్రీటు గోడలు, శ్లాబులు ఆ చల్లదనానికి పెద్దగా ప్రభావితం కావు. అంతకన్నా ఎంత తగ్గుతూ పోతే.. అంతగా చల్లబడి, 'ప్రభావం అంతగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు 8, 9 డిగ్రీలకు తగ్గిపోతే... గోడలు, శ్లాబు నుంచి తర్వాతి రోజంతా చల్లదనం వెలువడుతూనే ఉంటుంది. దానితో బయటికంటే ఇంట్లో చలి ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది వానలు ఎక్కువగా కురవడం, ఉత్తర వాయవ్య దిశ నుంచి వీస్తున్న శీతల గాలులతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. గత పదేళ్లలో అతి తక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు, ఎక్కువ రోజులు కొనసాగడం ఈసారే చూస్తున్నాం. మరో 10 రోజుల వరకు చలి తీవ్రత కొనసాగే అవకాశం ఉంది. సంక్రాంతి తర్వాత రాత్రిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో కనిష్ఠ, గరిష్ఠ ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం 15 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటోంది.

# ఆన్‌లైన్ గేమ్స్ బారిన మరో యువకుడు బలి

## డబ్బులు పోగొట్టుకోవడంతో ఆత్మహత్య

**మేడ్చల్, డిసెంబరు 27:** జిల్లాలోని సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డ రవీందర్ (24) అనే యువకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసైన రవీందర్ అందులో పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన మరణానికి ఎవరూ బాధ్యులు కారంటూ వీడియో రికార్డ్ చేశాడు. ఆపై రవీంద్ తన గదిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రవీందర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా.. గత కొద్దిరోజులుగా రవీందర్ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ ఆర్థికంగా నష్టపోయాడు. నష్టాలు పూరించేందుకు స్నేహితులు, తెలిసిన వారి వద్ద నుంచి భారీగా నగదును అప్పుగా తీసుకుని మరోసారి ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లో పెట్టుబడులు పెట్టాడు. అయితే ఎంత పెట్టుబడి పెట్టినా అతడికి లాభాలు రాకపోగా, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలోనే సూసైడ్‌కు పాల్పడినట్లు తెలుస్తోంది. ఆత్మహత్యకు ముందు రవీందర్ ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. ఆన్‌లైన్ గేమ్స్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయానని వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నానని, తనలా ఇంకెవరూ మోసపోవద్దంటూ స్నేహితులను కోరాడు. తన చావుకు ఎవరూ బాధ్యులు కాదంటూ వీడియో రికార్డ్ చేసిన అనంతరం గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవీందర్ ఆర్థిక సమస్యలతో



ఎక్కడెక్కడ అప్పులు చేశాడు, ఎంత మేరకు నష్టపోయాడు, సూసైడ్‌కు పూర్తి కారణాలు ఏంటి అనేదానిపై సూరారం పోలీసులు ఆరా తీస్తున్నారు.

# నిజామాబాద్‌లో రెచ్చిపోయిన దోపిడీ దొంగలు

## ఏటీఎంలను కట్ చేసి భారీగా నగదు దోపిడీ..

## రంగంలోకి దిగిన పోలీసులు..

**నిజామాబాద్, డిసెంబర్ 27:** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో దోపిడి దొంగలు రెచ్చిపోయారు. ముఖాలకు మాస్కులు ధరించి, చేతులకు గ్లౌజులు పెట్టుకొని ఏటీఎంలు లూటీ చేశారు. శనివారం తెల్లవారు జామున కారులో వచ్చిన దుండగులు.. గ్యాస్ కట్టర్ల సహాయంతో ఏటీఎంలను కట్ చేసి అందులోని నగదు దోచుకుపోయారు. నగరంలోని ఆర్యనగర్, సాయినగర్ ఏటీఎంలలో భారీ చోరీ జరిగింది. ఏటీఎంలను గ్యాస్ కట్టర్‌తో తెరిచి దుండగులు నగదు లూటీ చేశారు. సాయినగర్‌లోని ఎస్‌బీఐ ఏటీఎంలో సుమారు రూ.9 లక్షలు చోరీ చేశారు. ఆర్యనగర్‌లోని డీసీబీ ఏటీఎంలో దాదాపు రూ.30 లక్షలు ఎత్తుకెళ్లారు. గ్యాస్ కట్టర్ వాడినప్పుడు మరికొంత నగదు మంటల్లో కాలిపోయింది. ఐదుగురు సభ్యుల ముఠా దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా కేసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాలను కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర పరిశీలించారు. నిజామాబాద్ టౌన్ 4 పోలీస్ స్టేషన్ పరిధిలోని పాంగ్రా బ్రాంచ్‌కు సంబంధించిన డెవలప్‌మెంట్ క్రెడిట్ బ్యాంక్ ఏటీఎంలోకి ప్రవేశించిన దుండగులు గ్యాస్ కట్టర్ సహాయంతో మెషిన్‌ను కట్ చేసి సుమారు రూ. 25 లక్షలు దోచుకున్నారు. అలాగే నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్ని చౌరస్తా వద్ద గల ఎస్‌బీఐ ఏటీఎంలోనూ చోరీకి పాల్పడ్డారు. ముందుగా ఏటీఎం సెంటర్‌లో ఉన్న సీసీ కెమెరాలపై స్ప్రే చేసి రికార్డు కాకుండా జాగ్రత్త పడ్డ దుండగులు.. దాదాపు 10 లక్షల వరకు దోచుకుపోయినట్లు తెలిసింది. ఈ రెండు ఘటనా స్థలాలను కామారెడ్డి ఎస్పీ, ఇన్‌చార్జి సీపీ ఎం.రాజేశ్ చంద్ర పరిశీలించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించిన అనంతరం.. రెండు బ్యాంకుల మేనేజర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దోపిడీ జరిగిన ఏటీఎం లోపలి, పరిసర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీని సేకరించి, విశ్లేషించాలని ఇంచార్జి సీపీ



ఆదేశించారు. అలాగే క్లూస్ టీమ్, సాంకేతిక నిపుణులు, స్థానిక పోలీసు బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు. ఏటీఎంల దోపిడీతో అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం నిఘా కట్టుదిట్టం చేశారు. జిల్లాలోకి వచ్చే, పోయే పాయింట్లలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు.

## మహిళా కమిషన్ విచారణకు

# నటుడు శివాజీ

## తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన నటుడు

## కావాలనే కొందరు దుష్ప్రచారంపై ఆగ్రహం

**హైదరాబాద్, డిసెంబరు 27:** నటుడు శివాజీ బుద్ధభవన్‌లో మహిళా కమిషన్ ఎదుట విచారణకు హాజరయ్యారు. హీరోయిన్స్‌ను ఉద్దేశించి శివాజీ చేసిన అభ్యంతర వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించిన మహిళా కమిషన్ వివరణ ఇవ్వాలని శివాజీకి నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో విచారణకు హాజరైన శివాజీ.. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. శివాజీ స్టేట్‌మెంట్‌ను మహిళా కమిషన్ రికార్డ్ చేసుకుంది. ఇప్పటికే ఈ అంశంపై సోషల్ మీడియా వేదికగా శివాజీ క్షమాపణలు చెప్పారు. అనుకోకుండా మాటలు దొర్లాయని మహిళా కమిషన్ ముందు శివాజీ స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకుంటామని నటుడు చెప్పినట్లు సమాచారం. కాగా.. ఇటీవల దండోరా చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్‌ల వస్త్రధారణను ఉద్దేశించి నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దానిపై సోషల్ మీడియాలో స్పందించిన శివాజీ.. తాను అన్న మాటలను వెనక్కి తీసుకుంటున్నా ను.. క్షమించాలని కోరారు. అయినప్పటికీ మహిళా కమిషన్ మాత్రం.. ఆ వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాల్సిందే అంటూ నటుడికి నోటీసులు ఇచ్చింది. దీంతో శివాజీ వ్యక్తిగతంగా విచారణకు హాజరై.. మహిళా కమిషన్‌కు వివరణ ఇచ్చారు. అయితే తనకు బాగా కావాల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదని నటుడు శివాజీ అన్నారు. నేను ఏం తప్పు చేశానని నా మీద ఇంత కోపం. ఎవరు ఎలాంటి దుస్తులు వేసుకుంటే నాకేంటి? ఇంతకు ముందు ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయలేదా? వారి మీద ఇలానే మాట్లాడారా? నేను ఎవరినీ నొప్పించాలని మాట్లాడలేదు. ఇటీవల చోటు చేసుకున్న సంఘటనల నేపథ్యంలో మాట్లాడేటప్పుడు తప్పులు దొర్లాయి. నాతో కెరీర్ మొదలు పెట్టిన వారికి నాపై కోపం ఉంది. నా వ్యాఖ్యల తర్వాత నన్ను ఇబ్బంది పెట్టాలని కొందరు జూమ్ మీటింగ్ పెట్టుకుని చర్చించారు. నాకు బాగా కావాల్సిన వారు ఇంత కుట్ర చేస్తారని అనుకోలేదు. సలహాలు ఇవ్వటం మానుకోవాలని నాకు అర్థమైందని శివాజీ అన్నారు.

# పేద పిల్లలకు అండగా ఎన్టీఆర్ ట్రస్ట్

## ఎన్టీఆర్ట్ ట్రస్ట్ ఎడ్యుకేషన్ వార్షికోత్సవంలో చంద్రబాబు

**హైదరాబాద్, డిసెంబరు 27:** పేద పిల్లలకు అండగా ఉండాలనే ఎన్టీఆర్ ట్రస్ట్ స్థాపించామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్టీఆర్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ వార్షికోత్సవంలో సీఎం మాట్లాడారు. గండిపేటకు వస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది. ఒకప్పుడు పార్టీ ప్రధాన కార్యాలయం ఇక్కడ ఉండేది. ఒకప్పుడు రాజకీయ నేతలకు శిక్షణ ఇచ్చే కేంద్రం ఇది. ఇప్పుడు అదే స్థలంలో పిల్లలకు చదువు నేర్పుతున్నారు. రకరకాల కారణాల వల్ల చాలామంది పిల్లలు అనాథలుగా మారేవారు. ఆ పిల్లలకు పెద్ద దిక్కుగా ఉండాలనే ఈ విద్యాసంస్థలకు శ్రీకారం చుట్టాం. ఆ నాడు నాటిన చిన్న మొక్క.. ఇవాళ పెద్ద వృక్షంగా తయారైంది. ఈ విద్యాసంస్థను సమర్థంగా నిర్వహిస్తున్న ఘనత భువనేశ్వరిదే. గ్రూప్-1 పోస్టులకు ఇక్కడి నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీలు, ఎన్‌ఐటీల్లో 29 మంది సీట్లు సంపాదించారు. ఇప్పుడు పలు చోట్ల 1,641 మంది పిల్లలు చదువుతున్నారు. చిన్న పాఠశాల నుంచి ఇంటర్, డిగ్రీ కాలేజీ వరకుఈ సంస్థ ఎదిగింది. నా చొరవ వల్లే ఉన్నతవిద్యకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారింది. ఎవరైనా వ్యవసాయం, వ్యాపారం ద్వారా సంపాదించాలనే హెరిటేజ్ పెట్టాం. మొదట్లో హెరిటేజ్ బాధ్యతలు తీసుకునేందుకు భువనేశ్వరి ఒప్పుకోలేదు. తర్వాత హెరిటేజ్‌ను సమర్థంగా నిర్వహించే స్థాయికి ఆమె చేరారు. ఆరోజు హైటెక్‌సిటీ కట్టి ఐటీని ప్రోత్సహించాను. ఈరోజు మళ్లీ డేటా సెంటర్, ఏఐ, క్వాంటమ్ వ్యాలీ, క్వాంటమ్ కంప్యూటర్స్, గ్రీన్ ఎనర్జీ, సెమీ కండక్టర్, డ్రోన్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీకి చిరునామాగా ఏపీని తయారు చేయాలని నెక్స్ట్ జెనరేషన్‌కు వెళ్లాం. టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం' చంద్రబాబు అన్నారు.



# ఏడాది తరువాత పోలీసుల చార్జ్‌షీట్

## సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో 23మందిపై అభియోగాలు..

## ఏ11గా నటుడు అల్లు అర్జున్

**హైదరాబాద్, డిసెంబర్ 27:** సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో పోలీసులు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఏడాది తరవాత ఛార్జిషీట్ దాఖలు చేసి, మొత్తం 23 మందిపై అభియోగాలు మోపారు. ఛార్జిషీట్‌లో ఏ-11గా సినీ నటుడు అల్లు అర్జున్ పేరు చేర్చారు. 2024 డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటల సమయంలో పుష్ప-2 బెనిఫిట్ షో కోసం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్దకు వచ్చిన చిత్ర కథానాయకుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు ఎగబడటంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయడంతో రేవతి(35) అనే మహిళతోపాటు ఆమె కుమారుడు శ్రీతేజ(9) కింద పడిపోయి జనం కాళ్ల మధ్య నలిగిపోయారు. ఇద్దరూ తీవ్ర గాయాలతో స్పృహ తప్పారు. వెంటనే పోలీసులు వారిని పక్కకు తీసుకెళ్లి సీపీఆర్ చేశారు. హుటాహుటిన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తల్లి మృతిచెందారు. కుమారుడి పరిస్థితి విషమంగా ఉండటంతో నిమ్స్‌కు తరలించారు. పుష్ప-2 సినిమా చూసేందుకు మొత్తం నలుగురు కుటుంబ సభ్యులు రాగా.. తల్లి కుమారుడు తొక్కిసలాటలో చిక్కుకున్నారు. వారిలో తల్లి మృత్యువాతపడటం విషాదాన్ని నింపింది. తొక్కిసలాటలో మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటనపై చిక్కడపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

# మాసబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసు దర్యాప్తు

## పరారీలో నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్

**హైదరాబాద్, డిసెంబరు 27:** మాసబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది. మాసాబ్‌ట్యాంక్ డ్రగ్స్ కేసులో ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్‌ప్రీత్ పరారీలో ఉన్నాడు. అతడి కోసం ఈగల్ టీమ్, పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసులో ఈ నెల 17న ట్రూప్ బజార్‌కు చెందిన నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్విని అరెస్టు చేశారు. వారిని విచారించగా అమన్‌ప్రీత్ పేరు బయటకు వచ్చింది. ఈ ఇద్దరు వ్యాపారుల నుంచి అతడు డ్రగ్స్ కొన్నట్లు ఈగల్ టీమ్ గుర్తించింది. ఇద్దరు వ్యాపారుల నుంచి 43 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ స్వాధీనం చేసుకుంది. గతేడాది కూడా అమన్‌ప్రీత్ సైబరాబాద్ పోలీసులకు పట్టుబడ్డాడు. మరోవైపు నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్వికి మరో నలుగురు వ్యక్తులు డ్రగ్స్ సరఫరా చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈకేసులో నిందితుడు ప్రముఖ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ పరారీలో ఉన్నాడు. హీరోయిన్ సోదరుడి కోసం ఈగల్ టీం, మాసబ్ ట్యాంక్ పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. ట్రూప్ బజార్‌కు చెందిన నితిన్ సింఘానియా, శ్రనిక్ సింఘ్విల అరెస్టుతో నటి సోదరుడు పేరు బయటకు వచ్చిన విషయం తెలిసిందే. పట్టుబడ్డ ఇద్దరు వ్యాపారులకు నలుగురు రెగ్యులర్ కస్టమర్లు సప్లై చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇద్దరు వ్యాపారవేత్తల నుంచి నటి సోదరుడు డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు బయటపడింది. వ్యాపారవేత్తల నుంచి 43 గ్రాముల కొకైన్, ఎండీఎంఏ డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే టాలీవుడ్, బాలీవుడ్‌లో మంచి గుర్తింపు ఉన్న ప్రముఖ నటి సోదరుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. కాగా.. న్యూఇయర్ వేడుకల సందర్భంగా ఈగల్ టీం హైదరాబాద్ వ్యాప్తంగా దృష్టి సారించింది. డ్రగ్స్ నివారణకు ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఇటీవల డిసెంబర్ 19న మాసబ్ ట్యాంక్ వద్ద ట్రూప్‌బజార్‌కు చెందిన ఇద్దరు వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ సోదరుడు తరచుగా డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అతని కోసం పోలీసులు వెతుకుతున్నారు. కాగా.. గత సంవత్సరం కూడా డ్రగ్స్ కేసులో సైబరాబాద్ పోలీసులకు నటి సోదరుడు పట్టుబడిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరోసారి డ్రగ్స్ వ్యవహారంలో ఇరుక్కోవడం సంచలనంగా మారింది.

# ఐఏఎస్‌లకు కేంద్రం వార్నింగ్

## వివరాలు సమర్పించకపోతే చర్యలు

## కేంద్ర, రాష్ట్ర సెక్రటరీలు, సీఎస్‌లకు ఆదేశాలు

**ఢిల్లీ, డిసెంబర్27:** నిర్దేశిత గడువు లోపల తమ ఆస్తుల వివరాలు(ఇమ్మూవబుల్ ప్రాపర్టీ రిటర్న్స్ ఉఐపీఆర్) సపర్పించకపోతే కఠిన చర్యలు తప్పవని ఐఏఎస్‌అధికారులకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. 2025 క్యాలెండర్ సంవత్సరానికి సంబంధించిన ఆస్తుల వివరాలను తప్పనిసరిగా జనవరి 31, 2026లోపు స్పారో ఆన్‌లైన్ మాడ్యూల్‌లో సమర్పించాలని స్పష్టం చేసింది. డిసెంబర్ 23, 2025న డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం సమర్పించాలని, గడువు తర్వాత ఆన్‌లైన్ మాడ్యూల్ ఆటోమేటిక్‌గా మూసివేయబడుతుందని తెలిపింది. ఈ గడువులోగా వివరాలు సమర్పించని అధికారులకు విజిలెన్స్ క్లియరెన్స్ నిరాకరణ, ప్రమోషన్లు నిలిపివేయడం, క్రమశిక్షణ రాహిత్యం వంటి కఠిన చర్యలు తప్పవని కేంద్రం హెచ్చరించింది. గతంలో ఆన్‌లైన్ ఫైలింగ్ పెరిగినప్పటికీ, ఇకపై గడువును కచ్చితంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర సెక్రటరీలు, చీఫ్ సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధన ఆల్‌ఇండియా సర్వీసెస్(కండక్ట్) రూల్స్, 1968 ప్రకారం అమలులో ఉందని, పారదర్శకత, అక్రమ సంపాదన నివారణకు ఇది కీలకమని డీఓపీటీ పేర్కొంది. అధికారులు తప్పనిసరిగా గడువులోగా ఆస్తుల వివరాలు సమర్పించాలని సూచించింది.

# సిద్దిపేట జిల్లాలో పులి సంచారం

## అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక



**సిద్దిపేట, డిసెంబరు 27:** సిద్దిపేట జిల్లాలో పులి సంచారంతో జనం బిక్కుబిక్కుమంటున్నారు. మిరుదొడ్డి మండలం అందె, కొండాపూర్, తొగుట మండలం వరదరాజుపల్లి, గోవర్ధనగిరి ప్రాంతాల్లో పులి సంచరిస్తున్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. పాద ముద్రల ఆధారంగా పులి సంచారాన్ని గమనించిన అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా రైతులు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పులి సంచరిస్తున్న విషయం తెలియగానే ఈ ఊళ్లకు పక్కనే ఉన్న గోవర్ధనగిరి, ముత్యంపేట్, మిరుదొడ్డి మండలం అందె, కొండాపూర్ గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పులి సంచరిస్తున్న ప్రాంతాల ప్రజలకు పులి సంచారంపైన ఫారెస్ట్ అధికారి సందీప్ కుమార్ మాట్లాడుతూ.. నిన్న ఇక్కడ పులి కాలి ముద్రలు కనిపిస్తున్నాయని సమాచారం వచ్చిందని.. దీంతో సిద్దిపేట రెంజ్ సిబ్బంది, మా సిబ్బంది అనుమానస్పదమైన స్థలాన్ని వెతకడం జరిగింది. ఇది మన వరదరాజుపల్లి శివారులో ఒక పోలంలో అనుమానస్పదంగా పాదముద్రలు కనిపించాయి. నిన్న రాత్రి నుండి దర్యాప్తు చేయడం జరిగిందని.. దాని కదలికలు ఇక్కడే కనిపించాయని.. మేము మూడు టీంలుగా ఏర్పడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయడం జరిగిందన్నారు. ఇక్కడి నుంచి సిద్దిపేట మండలం తోర్నాల గ్రామం దిక్కు పోయినట్టు ఉందని అక్కడ కుడా పాద ముద్రలు కనిపిస్తున్నాయని తెలిపారు. పులితో అందరూ జాగ్రత్తగా ఉండాలని రైతులు పొలాల కాడికి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని తమ జీవాలను సాయంకాలం తమవెంటే ఇంటికి తీసుకరావాలని ఆయన చెప్పారు.



సంపాదకీయం

# హిందువులు లక్ష్యంగా బంగ్లాలో దాడులు!

బంగ్లాదేశ్‌లో అల్లర్లు భారత్‌ను రెచ్చగొట్టేలా సాగుతున్నాయా అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే యూనస్ తాత్కాలిక నేతగా పగ్గాలు చేపట్టిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయి. హసీనాను పదవీచ్యుతి చేసిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే వందలమందిని హతమార్చారు. హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న నేపథ్యంలో కావాలనే అక్కడి మైనార్టీ హిందువులపై దాడులు విపరీతం అయ్యాయి. రాజకీయ హింసలో భాగంగా వీటిని చూపే ప్రయత్నం చేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. అయితే గత ఏడాదిగా అక్కడ జరుగుతున్న అల్లర్లు కేవలం హిందువులను ఊచకోత కోసేవిగా ఉన్నాయి. పనిగట్టుకుని మూకలు రెచ్చిపోతున్నా, తాత్కాలిక ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఇద్దరు హిందువులను హతమర్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాలపై భారతదేశంలో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవు తున్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మూక దాడులను, హత్యలను సినీ ప్రముఖులు ఖండిస్తున్నారు. గాజాలో జరిగిన పరిణామాలను అయ్యో పాపం అనుకున్న భారతీయులు, పొరుగు దేశం బంగ్లదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా మౌనం వీడాలంటూ సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ క్రమంలోనే హీరోయిన్లు జాన్వీపూర్, కాజల్ అగర్వాల్, సీనియర్ నటి, మాజీ ఎంపీ జయప్రద చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి కారణంగా ఆ దేశం రణరంగంగా మారిన సంగతి తెలిసిందే. అక్కడ ఇటీవల హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. తొలుత దీపుచంద్ర దాస్ అనే వ్యక్తిని దారుణంగా కొట్టి చంపి, అతని మృతదేహానికి నిప్పంటించిన ఘటన మురువకముందే తాజాగా మరో వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన జరిగింది. అమృత్ మండల్ అలియాస్ సామ్రాట్ అనే వ్యక్తి రాజ్‌బరిలోని పంగ్షా ఉప జిల్లాలో హత్యకు గురయ్యాడు. సామ్రాట్ హత్య ఏ విధంగానూ మతపరమైనది కాదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇది కేవలం హత్యను కప్పిపుచ్చుకోవడానికి చేసిన ప్రయత్నం తప్ప మరోటి కాదు. అయితే హిందువులపై జరుగుతున్న వరుస దాడులపై భారత్ తీవ్రంగా స్పందించింది. మైనారిటీ కమ్యూనిటీ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఇటీవల జరిగిన వరుస సంఘటనలను ఆందోళన కలిగించేవిగా అభివర్ణించింది. హిందువులపై ఇలాంటి హింసను విస్మరించలేమని భారత్ హెచ్చరించింది. సరిహద్దు వెంబడి జరుగుతున్న పరిణామాలను న్యూఢిల్లీ తీవ్రంగా పరిగణించిందని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. హిందువులపై జరుగుతున్న హింసను విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. బాధ్యులను గుర్తించి శిక్షిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో ఇటీవలి పరిణామాల గురించి ప్రపంచమంతా గమనిస్తోంది. వాటిని నిశితంగా గమనిస్తున్నట్లు భారత్ కూడా పేర్కొంది. శాంతిభద్రతల పరిస్థితి విషయానికొస్తే అక్కడ ఏం జరుగుతుందో ఎప్పటి కప్పుడు భారత్ తెలియజేస్తున్నది. బంగ్లాదేశ్‌లోని హిందువులు, క్రైస్త్రవులు, బౌద్ధులు సహా మైనారిటీలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగించే విషయమని జైస్వాల్ అన్నారు. మైమెన్‌సింగ్‌లో ఇటీవల జరిగిన హిందూ యువకుడి దారుణ హత్యను ఖండిస్తున్నామని అన్నారు. ఈ నేరానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని ఆశిస్తున్నాం. తాత్కాలిక ప్రభుత్వ హయాంలో హత్యలు, దహనాలు, భూ కబ్జాలతో సహా మైనారిటీలపై 2,900 కంటే ఎక్కువ హింసాత్మక సంఘటనలు జరిగినట్లు స్వతంత్ర వర్గాలు నమోదు చేశాయి. ఈ సంఘటనలను కేవలం రాజకీయ హింసగా తోసిపుచ్చలేమని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఇద్దరు హిందూ వ్యక్తులను కొట్టి చంపిన నేపథ్యంలో భారత్ ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే ప్రపంచవ్యాప్తంగా నిరసలు వస్తున్నా బంగ్లాదేశ్‌లో ముస్లిమేతరులు సహా పలువురి మీద జరుగుతున్న దాడులపై ప్రకంపనలు ఆగడం లేదు. విప్లవవాద నాయకుడు షరీఫ్ ఒస్మాన్ హడీ హత్యను నిరసిస్తూ అతని మద్దతుదారులు శుక్రవారం ఢాకాలోని కీలక కూడలిని దిగ్బంధం చేశారు. న్యాయం చేయాలని నినదిస్తూ బైఠాయించడంతో ట్రాఫిక్ గంటలతరబడి నిలిచిపోయింది. ఢాకా విశ్వవిద్యాలయ మసీదు నుంచి షాబాగ్ వరకు ప్రదర్శన చేపట్టి ధర్నా నిర్వహించారు. న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. హడీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లు, విధ్వంసకాండలో హిందూ కార్మికుడు దీపూ చంద్రదాస్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మరోవైపు.. బ్రిటన్‌లోని ప్రవాసం వీడి 17 ఏళ్ల తర్వాత స్వదేశానికి చేరుకున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రహ్మాన్ తన తండ్రి, బంగ్లా మాజీ అధ్యక్షుడు జియాఉర్ రహ్మాన్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు. 19 ఏళ్ల తర్వాత ఈ సమాధి వద్దకు రాగలగడంపై ఉద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీ లపై దాడుల్ని కేంద్ర మాజీమంత్రి మీనాక్షీ లేఖి ఖండించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో ఇంకా కొందరు నేతలు మొగల్ చక్రవర్తి బాబర్ మాదిరి ఆలోచనాధోరణితో ఉన్నారని విమర్శించారు. అందుకే ఆ రెండు దేశాల్లో హత్యలు జరుగుతున్నాయన్నారు. భారత్‌ను రెచ్చగొట్టాలనేదే వారి ఉద్దేశమని ఆరోపించారు. దండెత్తి వచ్చేవారిపై సహృదయత చూపాల్సిన అవసరం లేదన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల్ని భారత్ ఖండించింది. కిరాతకమైన దాడిలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడానికి కారకులైన దోషుల్ని శిక్షించాలని డిమాండ్ చేసింది. తాత్కాలిక ప్రభుత్వం వచ్చాక దాదాపు 2,900 హింసాత్మక ఘటనలు మైనారిటీలపై జరిగాయని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. వీటిని రాజకీయ హింసగా కొట్టిపారేయలేమంది. పశ్చిమబెంగాల్ శాసనసభ విపక్షనేత సువేందు అధికారి కోల్‌కతాలో బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయంలో సీనియర్ అధికారులను కలిశారు. హిందూ మైనారిటీలపై దాడులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐదులక్షల మంది సన్యాసులతో వచ్చి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లోని రెండుకోట్ల మంది హిందువుల్ని పదేపదే లక్ష్యంగా చేసుకుంటుంటే భారత్‌లోని వందకోట్ల మంది హిందువులు మౌన ప్రేక్షకులుగా కూర్చొంటారా అని ప్రశ్నించారు. మొత్తంగా బంగ్లను ఇలాగే వదిలేస్తే దారుణాలు పెరుగుతాయని గుర్తించాలి.




# పేదల కడుపుపై తన్నిన మోదీ ప్రభుత్వం

- దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్ప
- ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు నష్టం
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, డిసెంబరు 27:** దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని, ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దుతో కోట్లాది పేదలకు ఉపాధి కరువవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో ఖర్గే పలు కీలక అంశాలపై మాట్లాడారు. నరేగా రద్దును మహాత్మాగాంధీకి అవమానంగా, 'రైట్ టు వర్క్'పై మోదీ సర్కార్ క్రూర దాడిగా ఖర్గే అభివర్ణించారు. 'పేదల కడుపుపై తన్నిన మోదీ ప్రభుత్వం.. పేదల కంటే కార్పొరేట్ల లాభాలే ముఖ్యం' అని ఖర్గే విమర్శించారు. జఖం హయాంలో అమలైన హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. 2006లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైన ఈ పథకం గ్రామీణ భారత ముఖచిత్రాన్ని మార్చిందని, దళితులు, ఆదివాసీలు, మహిళలకు భరోసా ఇచ్చిందని, పేదరికం నుంచి బయటపడ్డ తరాన్ని సృష్టించిందని ఖర్గే చెప్పుకొచ్చారు. ఎలాంటి అధ్యయనం లేకుండా రద్దు చేశారని మండిపడ్డారు. మూడు నల్ల వ్యవసాయ చట్టాల తరహాలోనేనని, రైతు ఉద్యమంలా దేశవ్యాప్త పోరాటం అవసరమని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ఓఉఔఖీఇఉంపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సభ్యులకు ఖర్గే సూచించారు. కాంగ్రెస్ 'సంస్థా సృజన అభియాన్'ను కొనసాగిస్తామని ఖర్గే తెలిపారు. 500 జిల్లాల్లో జిల్లా అధ్యక్షుల నియామకం పూర్తయిందని, బూత్ స్థాయి వరకూ పార్టీని బలోపేతం చేస్తున్నామని ఖర్గే చెప్పారు. 2026 ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమని ఆయన ప్రకటించారు.

# నకిలీ ఏజెంట్ల మాటలు నమ్మకండి

వీసా దరఖాస్తుదారులకు అమెరికన్ ఎంబసీ హెచ్చరిక

**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** మీడియేటర్ల మాటలు నమ్మి మోసపోవద్దని, వీసా దరఖాస్తుదారులకు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్స్ ఆలస్యమవుతుండటంపై యూఎస్ ఎంబసీ స్పందించింది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకొని కొందరు నకిలీ ఏజెంట్లు మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొంది. ఎలాంటి జాప్యాలకు తావు లేకుండా వీసా లభించేలా చూస్తామంటూ ఆ నకిలీ ఏజెంట్లు దరఖాస్తుదారుల్ని సంప్రదిస్తున్నారని అప్రమత్తం చేసింది. అలాంటి హామీలను నమ్మొద్దని, దానివల్ల ఆర్థికంగా నష్టం, ప్రయాణ ప్రణాళికల్లో ఇబ్బందులు తలెత్తవచ్చని ఎక్స్ వేదికగా అడ్వైజరీ జారీ చేసింది. వీసా అపాయింట్‌మెంట్లు అధికారిక వెబ్‌సైట్ల




ద్వారానే షెడ్యూల్ అవుతాయని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ ద్వారా కాకుండా ఇతర మార్గాల్లో ఎవరైనా వీసా ఇప్పిస్తామంటే అది మోసం కిందికే వస్తుందని హెచ్చరించింది. అధికారిక ప్రక్రియలో భాగంగా పేర్కొన్న ఫీజు కంటే ఎక్కువ మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదని సూచించింది. అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ కారణంగా భారత హెచ్-1బీ దరఖాస్తుదారులు ఇబ్బంది పడుతోన్న సంగతి తెలిసిందే. దాని కారణంగా కొన్ని నెలల పాటు వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. ఈ వ్యవహారంపై మన దేశం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై అమెరికా వర్గాలతో చర్చిస్తున్నట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# పాక్‌తో అప్రమత్తంగా ఉండాల్సిందే

పాక్ సైనిక వ్యూహాలను తేలికగా తీసుకోరాదు

కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 27:** కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ తరవాత మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వచ్చిందన్నారు. పాక్‌ను తక్కువ అంచనా వేయకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాగే దానిని నమ్మడానికి లేదన్నారు. పాకిస్థాన్‌లో మారుతున్న సైనిక వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థలను.. భారత్ తేలిగ్గా తీసుకోకూడదని హెచ్చరించారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్‌తో ఉన్న గత అనుభవాల నుంచి భారత్ చాలా నేర్చుకున్నందున ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉండాలన్నారు. డ్రోన్లు, రాకెట్లు, క్షిపణుల తర్వాత హైపర్‌సోనిక్ సాంకేతికతపై పాక్ దృష్టిసారించిందన్నారు. ఇది భారత్ తేలికగా తీసుకునే విషయం కాదన్నారు. పాక్‌లో ప్రజాస్వామ్యం నామమాత్రంగానే ఉందని.. ఇప్పటికీ సైనిక ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. ఆర్థికంగా దుర్భర పరిస్థితిలో ఉన్న ఆ దేశం.. విదేశాల నుంచి అందే సాయంపైనే ఆధారపడుతుందని థరూర్ అన్నారు. ఇక, బంగ్లాదేశ్ దాని సొంత సమస్యలతో సతమతమవుతోందన్నారు. పాక్‌తో రక్షణ ఒప్పందానికి బంగ్లా చేస్తున్న చర్చల గురించి ప్రస్తావిస్తూ.. భారత్ మాకు శత్రువు అనే అభిప్రాయాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొరుగు దేశాల్లో పెరుగుతున్న భారత వ్యతిరేకతపై ఆయన మాట్లాడుతూ.. బంగ్లాలో స్థిరమైన, శాంతియుత వాతావరణం మనకు చాలా కీలకమన్నారు. ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి విడదీస్తామంటూ వస్తోన్న హెచ్చరికలపై ఆందోళన వ్యక్తం చేశారు.



# తండ్రి అనారోగ్యంతో అప్పులపాలు

తల్లిదండ్రులను చంపి కుమారుల ఆత్మహత్య

**ముంబై, డిసెంబరు 27:** ఇద్దరు కొడుకులు కలసి నిద్రిస్తున్న తల్లిదండ్రులను హత్య చేశారు. ఆ తర్వాత రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. తండ్రి అనారోగ్యం వల్ల అప్పులపాలు కావడంతో వారిద్దరూ ఇలా చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. డిసెంబర్ 25న జవాలా మురార్ గ్రామానికి చెందిన 51 ఏళ్ల రమేష్ సోనాజీ లాఖే, 45 ఏళ్ల భార్య రాధాబాయి వారి ఇంట్లో మంచంపై మరణించడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఆ ఇంటికి చేరుకున్నారు. దంపతుల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిద్రిస్తున్న ఆ భార్యాభర్తలను గొంతునొక్కి చంపినట్లు పోస్ట్‌మార్టం రిపోర్ట్‌లో తేలింది. కాగా, అదే రోజున ఆ గ్రామానికి కొంత దూరంలోని రైలు పట్టాలపై ఆ దంపతుల కుమారులులైన 25 ఏళ్ల ఉమేష్, 23 ఏళ్ల బజరంగ్ మృతదేహాలు కనిపించాయి. దీంతో వారిద్దరి మృతదేహాలను కూడా పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అన్నాదమ్ములు రైలు ముందు దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. మరోవైపు ఒకే రోజు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వేర్వేరుగా మరణించిన ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేశారు. స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. పక్షవాతంతో మంచానికి పరిమితమైన రమేష్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఆయనకు చికిత్స కోసం ఆ కుటుంబం అప్పులపాలైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆర్థిక బాధలు తట్టుకోలేక ఇద్దరు కుమారులు తమ తల్లిదండ్రులను చంపి ఆ తర్వాత రైలు ముందు దూకి ఆత్మహత్య చేసుకున్నారని పోలీసులు గ్రహించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# వెచ్చదనం కోసం ఇంట్లో నిప్పుల కుంపటి

అర్ధరాత్రి వేళ విష వాయువులకు ముగ్గురు మృతి

**పాట్నా, డిసెంబరు 27:** చలికాలం నేపథ్యంలో గదిలో వెచ్చదనం కోసం మంట రాజేసి ఒక కుటుంబం నిద్రించింది. విష వాయువులు వెలువడంతో ఒక వృద్ధురాలు, ముగ్గురు పిల్లలు మరణించారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నది. బీహార్‌లోని చాప్రా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. చాప్రాకు చెందిన ఒక కుటుంబం గురువారం రాత్రి వేళ గదిలో వెచ్చదనం కోసం బొగ్గుల కుంపటి వెలిగించారు. తలుపులు, కిటికీలు మూసేశారు. ఎనిమిది మంది కుటుంబ సభ్యులు ఆ గదిలో నిద్రించారు. కాగా, బొగ్గుల కుంపటి మండటంతో ఆ గదిలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోయాయి. విషపూరిత కార్బన్ మోనాక్సైడ్ పేరుకుపోయింది. దీంతో ఆ గదిలో నిద్రించిన ఎనిమిది మంది స్పృహ కోల్పోయారు. శుక్రవారం తెల్లవారుజామున కింది అంతస్తులో నివసించే బంధువులు పైకి వెళ్లి చూశారు. ఆ గదిలో ఉన్న వారి పరిస్థితి చూసి ఆందోళన చెందారు. మరోవైపు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. మూడేళ్ల తేజాంష్ కుమార్, ఏడు నెలల గుడియా కుమారి, ఆదియా కుమారి, 70 ఏళ్ల కమలావతి దేవి అప్పటికే మరణినంచినట్లు డాక్టర్లు నిర్ధారించారు. 25 ఏళ్ల ఆర్య కుమారి, 24 ఏళ్ల ఆర్య సింగ్, 25 ఏళ్ల అనిషా, 35 ఏళ్ల అమిత్ అలియాస్ సోనుకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఆ తర్వాత బొగ్గుల కుంపటి ఉంచిన గదిని పరిశీలించారు. ఫోరెన్సిక్ బృందాన్ని పంపి ఆధారాలు సేకరించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు శీతాకాలంలో మూసి ఉన్న బెడ్ రూముల్లో బ్రజియర్లు, హీటర్లు, బ్లోయర్‌లను ఉపయోగించవద్దని ఆ జిల్లా అధికారులు సూచించారు. నిద్రించే గదిలో సరైన వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలని కోరారు. తద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

## సమస్యలపై పరిశీలించిన సర్పంచ్



**నేటి సాక్షి, నారాయణపేట:** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల పరిధిలోని పసుపుల గ్రామంలో పలు వార్డులలో పలు సమస్యలను పసుపుల గ్రామ సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. శనివారం గ్రామంలోని పలు వార్డులలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పలు వార్డులలో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. పసుపుల గ్రామంలో శనివారం నాడు గ్రామానికి చెందిన ఒకరు అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. ఆ కుటుంబ సభ్యులకు భాను ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో 3000 రూపాయలను కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది అందజేయడం జరిగింది. గ్రామ సర్పంచ్, గ్రామ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు ఆధ్వర్యంలో పరామర్శించడం జరిగింది.

## సర్పంచులకు మంత్రి సన్మానం



**నేటి సాక్షి, కరీంనగర్:** ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులను మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. కరీంనగర్‌లోని డీసీసీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని, సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా కృషిచేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, ఆరెపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం



**నేటి సాక్షి, జగిత్యాల టౌన్:** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు ఆధ్వర్యంలో కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో భక్తుల అవసరాల నిమిత్తం కొరకు 2000 మంది భక్తులకు సరిపడే దీక్షా విరమణ మండపం మరియు 96 గదుల సత్రం నిర్మాణానికి 35 కోట్ల 19 లక్షల రూపాయలను టీటీడీ బోర్డు విడుదల చేసిన సందర్భంలో. జగిత్యాల జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో. 27.12.2025 శనివారం రోజున జగిత్యాల్ టవర్ సర్కిల్ దగ్గర ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన జన సైనికుడు సట్ట సతీష్. అనుమల్ల రాజశేఖర్, పుప్పాల రెడ్డి. పులి రాము. ఏను గుర్తి శ్రవణ్ %ఁ% హైందవ బంధువులు వేముల సంతోష్ దుబ్బా శ్రవణ్. హరీష్ సాయి కృష్ణ. శ్రీధర్. బడే శంకర్. రమేష్ సంతోష్.ధర్మ రాజు. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల డీఎంహెచ్‌ఓ ఆకస్మిక మృతి

**నేటి సాక్షి, జగిత్యాల టౌన్:** జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఈరోజు ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు, ఆయన హఠాత్తుగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు, సహచరులు శోకసంద్రంలో మునిగిపోయారు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది కూడా తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రంగంలో అంకితభావంతో



పనిచేస్తూ, బాధ్యతాయుత అధికారిగా మంచి గుర్తింపు పొందిన శ్రీనివాస్ మరణం వైద్య శాఖకు తీరని లోటుగా వారు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఈ విషాద వార్త వెలువడగానే కలెక్టరేట్ సిబ్బంది, వైద్య విభాగ సహచరులు, మిత్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటికి చేరుకుంటున్నారు. ఆయనతో కలిసి పనిచేసిన పలువురు అధికారులు భావోద్వేగానికి లోనయ్యారు, సేవాభావంతో మానవీయ విలువలతో విధులు నిర్వహించిన వ్యక్తిగా డాక్టర్ ఆకుల శ్రీనివాస్ ఎప్పటికీ గుర్తుండిపోతారని పలువురు అభిప్రాయపడ్డారు.

# మహిళ చనిపోవడానికి కారకులెవరు..
# ఈ పాపం ఎవరిది!

- మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో హృదయ విదారక ఘటన..
- ఏ రోజు జగన్ అధికారం కోల్పోయాడో ఆ రోజు నుంచే ఆరోగ్యం డీలా..
- కొంత మంది ప్రభుత్వ వైద్యులు కక్కుర్తి కాసులకు అలవాటుపడ్డారని ఆగ్రహం..
- పేద ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని వైసీపీ ఆరోపణ..



**నేటి సాక్షి, అన్నమయ్య:** ఆమె చావుకు కారకులెవరు. ఈ పాపం ఎవరిది. మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో హృదయ విదారక ఘటన చోటు చేసుకుంది. చికిత్స కోసమని వచ్చి ఆస్పత్రి బయట పడుకొని చలికి తట్టుకోలేక ఓ మహిళ ప్రాణాలు విడిచింది. ఈ ఘటన శనివారం మదనపల్లి లోని జిల్లా ఆస్పత్రిలో వెలుగు చూసింది. ఈ విషాదకర ఘటనకు కారకులెవరని ఈ పాపం ఎవరిదని ఎవరిని నిందించాలని వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ఇక వివరాల్లోకెళ్తే తంబళ్లపల్లి నియోజకవర్గ పరిధిలోని బలకవారిపల్లి గ్రామానికి చెందిన రాగిణి వెంకటప్ప భార్య మల్లమ్మ ఆరోగ్యం సరిలేక శుక్రవారం మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చింది. తాత్కాలిక వైద్యం పొందినట్లు చేతికి క్యాన్ల కలిగుంది. ఆస్పత్రి లోపల పండుకోవాలంటే సిబ్బంది అనుమతించలేదు. దీంతో ఆమె ఆస్పత్రి ఆరు బయట స్లాబు కింద పడుకొని రాత్రంతా చలికి తట్టుకోలేకపోయింది. శనివారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది లేపే ప్రయత్నం చేశారు. ఆమెలో ఎలాంటి స్పందన లేదు. ఆ మహిళ చనిపోయిందని గుర్తించారు. వెంటనే అత్యవసర విభాగంలోనికి తీసుకొచ్చి పరీక్షించిన వైద్యులు ఆమె రాత్రే చనిపోయిందని నిర్ధారించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఇంత దారుణ ఘటన జరగడానికి ఆసుపత్రి ఉన్నతాధికారులు, కొందరి ఉద్యోగులే కారణమని వైసీపీ శ్రేణులు యువనేత హర్షవర్ధన్ రెడ్డి ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రి తమ సొంత జాగిర్ల భావించి కొందరు రోగులను ఆసుపత్రి లోపల పడుకోవడానికి అనుమతించడం లేదనే ఆరోపణలున్నాయి. దానికి తోడు రాత్రంతా చలిలో ఆరు బయట పడుకోవడం వల్ల ఆమె ప్రాణాలు పోగొట్టుకుందని ఆమె బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కొందరి సిబ్బంది ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్న తీరుపై ఆసుపత్రి సూపరింటెంట్, ఆర్ ఎమ్.ఓ ల దృష్టికి తీసుకెళ్లారు. రోగుల పట్ల కనికరం లేకుండా కఠినంగా వ్యవహరించడంతోనే మల్లమ్మ మృతి చెందిందని ఆమె మృతికి సిబ్బందే కారణమని మదనపల్లి వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు హర్షవర్ధన్ రెడ్డి తో పాటువైసీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. ఏ రోజు జగన్ అధికారం కోల్పోయాడో ఆ రోజు నుంచే ఆంధ్రప్రదేశ్ లో ఆరోగ్యం డీలా పడిందని వైసీపీ శ్రేణులు మండిపడ్డారు. పేదలకు ఉచిత వైద్యం అందడం లేదని కార్పొరేట్ ఆసుపత్రులకు వత్తాసు పలుకుతున్న కూటమి ప్రభుత్వ వైఖరితో కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి చూపించుకునే స్తోమత లేక ఇలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రాణాలు విడుస్తున్నారని గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్యం అందకపోతే తక్షణమే చర్యలు తీసుకునేవారని కూటమి ప్రభుత్వం అధికారాన్ని చేపట్టాక కార్పొరేట్ ఆసుపత్రులను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ ఆసుపత్రులను పూర్తిగా పట్టించుకోవడం మానేసిందని దీంతో కొంత మంది ప్రభుత్వ వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పేద ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని వైసీపీ యువజన విభాగ అధ్యక్షులు హర్షవర్ధన్ రెడ్డి ఆరోపిస్తున్నారు.

# ప్రజా సేవలో అంకిత భావంతో పనిచేయాలి

- కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



**నేటి సాక్షి, అన్నమయ్య, శర్మ:** జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పలువురు సబ్ ఇన్ స్పెక్టర్లు శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి కలిసిన వారిలో రామసముద్రం ఎస్ఐ ఉమామహేశ్వర్ రెడ్డి, గుర్రంకొండ ఎస్ఐ రవీంద్ర బాబు, వాయల్పాడు ఎస్ఐ తిప్పేస్వామి, మొలకలచెరువు ఎస్ఐ ప్రతాప్, మదనపల్లి తాలూకా ఎస్ఐ రామకృష్ణారెడ్డి మరియు సీసీఎస్ ఎస్ఐ నర్సింహుడు పుష్పగుచ్ఛమందించి దుశ్శాలువలు కప్పి ఆయా స్టేషన్ల పరిధిలో చేపట్టాల్సిన విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధికారులను ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అభినందించారు. వారికి విధి నిర్వహణలో చేపట్టాల్సిన పలు కీలక సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడి పట్ల సానుకూలంగా స్పందించాలని, త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. తమ పరిధిలోని గ్రామాలలో శాంతిభద్రతలను కాపాడుతూ, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆధునిక నేరాలను అరికట్టేందుకు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, కేసుల దర్యాప్తులో పారదర్శకత పాటించాలని సూచించారు. ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా చూడాలని ఎస్పీ ఉద్ఘాటించారు. పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచేలా ప్రతి ఒక్క అధికారి నిబద్ధతతో పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు..

# చెలిమిళ్ల కబడ్డీ పోటీల్లో గెలుపొందిన మొదటి విజేత

- టీంకు 35వేల రూపాయలు బహుమతి ప్రధానం చేసిన ఐఆర్ఎస్ అసిస్టెంట్ కమిషనర్ వేల్పుల ఆనంద్ కుమార్

**నేటి సాక్షి పాములపాడు:** పాములపాడు మండలంలోని, చెలిమిళ్ళ గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా సిఎస్ఐ సంఘం ఏర్పాటుచేసిన కబడ్డీ పోటీలను ఐఆర్ఎస్ అసిస్టెంట్ కమిషనర్ వేల్పుల ఆనంద్ కుమార్ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది అదేవిధంగా మద్దూరు గ్రామంలో షాప్‌ను కూడా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. అక్కడ కూడా ఆయనకు మెడలో పూలమాలవేసి ఘనస్వాగతం పలకడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఐఆర్ఎస్ అసిస్టెంట్ కమిషనర్ వేల్పుల ఆనంద్ కుమార్ కు ఎద్దుల బండిమీద మేల తాళాలతో ఊరేగింపుతో కార్యక్రమానికి తీసుకొని వెళ్లడం జరిగింది. ఆయన అనంతరం కబడ్డీ టీమ్ సభ్యులను షేక్‌హ్యాండ్ ఇచ్చి పరిచయం చేసుకోవడం జరిగింది ఈ కబడ్డీ పోటీలలో 36 టీములు పాల్గొనగా, అందులో ఫైనల్ గా గెలుపొందిన మొదటి విజేత టీంకు అసిస్టెంట్ కమిషనర్ వేల్పుల ఆనంద్ కుమార్ మొదటి బహుమతి నగదు 35,000 రూపాయలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా గెలుపొందున ఇతర విజేతలకు రెండవ బహుమతి సంఘ పెద్దలు 25వేల రూపాయలు, డి.పెద్ద పుల్లయ్య మూడవ బహుమతి 15వేలు, నాలుగో బహుమతి వి.ప్రాచీస్, నడిపిన నారాయణ-10వేలు, ఐదో బహుమతి గణముల బ్రదర్స్-5 వేలు, ఆరవ బహుమతి సిఎస్ఐ సంఘం-3 వేల రూపాయల ప్రకారము ఇవ్వడం జరిగింది. ఈ పోటీలలో పాల్గొన్న వాళ్ళందరికీ, ప్రజలకు గ్రామసర్పంచ్ కోట్ల. చంద్రారెడ్డి భోజన వసతి సదుపాయాలు కల్పించడం జరిగింది ఈ సందర్భంగా ఐఆర్ఎస్ అసిస్టెంట్ కమిషనర్ వేల్పుల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ గ్రామాలలో పండుగ పూట ఇటువంటి పోటీలు ఏర్పాటు చేయడం వలన అందరికీ ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తూ ఉంటాయన్నారు ఈ కార్యక్రమంలో వేల్పుల సైన్యం బిసి ఐక్య సంఘం అధ్యక్షుడు గట్టు.శంకర్ గౌడ్, జాతీయ బీసీ సంఘంప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల.సంజీవరాయుడు, ఆర్.ఎల్ల గౌడ్, మింగి.శ్రీనివాసులు, మేకల సుధాకర్, చాకలి శివుడు,



వెంకటేశ్వర్లు గౌడ్, వెంకటరమణ, రాము గౌడ్ వేల్పుల రాజు, కిట్టు, సత్యరాజ్, వినోద్ కుమార్, స్వామిదాసు,

# హన్మాజిపల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

- కరీంనగర్ ఆర్టీసీ డిప్యూటీ ఆర్ ఎం భూపతిరెడ్డికి వినతి పత్రం అందజేసిన సర్పంచ్ నందికొండ అంజిరెడ్డి

**నేటి సాక్షి, గన్నేరువరం:** ఆర్టీసీ బస్సు కరీంనగర్ నుండి గుండ్లపల్లి జంగాపల్లి హన్మాజిపల్లి పంతులు కొండాపూర్ మైలారం మీదిగా మండల కేంద్రమైన గన్నేరువరం వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కరీంనగర్ ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డిని కలిసిన హన్మాజిపల్లి సర్పంచ్ నందికొండ అంజిరెడ్డి రోజా దంపతులు శనివారం రోజున కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి నందికొండ తిరుపతిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గన్నేరువరం మండల కేంద్రానికి వెళ్లాలన్న రావాలన్న ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలిపారు. పండించిన కూరగాయలు కరీంనగర్ మార్కెట్ కు వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలు ఆటోలు ఆశ్రయించాల్సిన అవసరం వస్తుందని అన్నారు. సరైన ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక గుండ్లపల్లి నుండి మానస దేవి మైలారం మల్లికార్జున స్వామి పారువేళ్ల లక్ష్మీ గణపతి ఆలయాలకు సరైన వేళలో ఆర్టీసీ బస్సులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వివిధ గ్రామాలలో వృద్ధులు బడి పిల్లలు కాలేజీ విద్యార్థులు సౌకర్యం మరియు మా గ్రామం మీదుగా వెంటనే ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కరీంనగర్ ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భూపతిరెడ్డిని



కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్ రెడ్డి, నందికొండ తిరుపతి రెడ్డి,వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించాలి

- క్రీడాకారులకే ఉద్యోగావకాశాలు ఉంటుంది
- శాప్ చైర్మన్ రవి నాయుడు




**నేటి సాక్షి తిరుపతి:** ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై మొగ్గు చూపాలని, ముందుగా క్రీడాకారులకే ప్రభుత్వం ఉ ద్యోగ అవకాశాలు కల్పిస్తుందని శాప్ చైర్మన్ రవి నాయుడు అన్నారు శనివారం మండల కేంద్రములోని శ్రీ గీతాంజలి స్కూల్ లో మేన్వల్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం నిర్వహించారు ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రవి నాయుడు తోపాటు ఎ ఎస్పీ రవి మనోహర్ ఆచ్చారి పాల్గొన్నారు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ జెండాను ఆవిష్కరించారు విద్యార్థులచే స్పోర్ట్ మార్చ్ నిర్వహించారు అనంతరం క్రీడా జ్యోతి వెలిగించారు ఈ కార్యక్రమంలో శ్రీ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ మాధవి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడారంగంలో కూడా శ్రీ గీతాంజలి విద్యాసంస్థల విద్యార్థులు ముందు ఉండాలని, విద్యార్థులను ప్రోత్సహించడంలో ముందు ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యఅతిథిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం శ్రీ గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సురేంద్ర మాట్లాడుతూ గెలుపు ఓటములతో సంబంధం లేకుండా విద్యార్థులందరూ క్రీడలలో బాగా రాణించాలని విద్యార్థులకు పిలుపునిచ్చి ప్రోత్సహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎ ఎస్పీ రవి మనోహర్ ఆచ్చారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలలో ఓడిపోవడం అంటే జీవితంలో ఓడిపోవడం కాదు ఓటమి నుంచే మన గెలుపును వెతుక్కోవాలని ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రంగాల్లో ముందు ఉంటారని ఆరోగ్యమే మహాభాగ్యంని విద్యార్థులకి తెలియజేశారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ విద్యతో పాటు ప్రతి విద్యార్థి క్రీడలు పాల్గొనాలని క్రీడల్లో రాణించినవారికి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని చెప్పారు ఐటీ, విద్యా శాఖామంత్రి నారా లోకేష్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అనేక సంస్కరణలు తీసుకు వచ్చారు విద్యార్థులకు క్రీడా స్ఫూర్తిని మెరుగుపరచుటకు విద్యార్థులకు ఉన్నతమైన విలువలు నేర్పుటకు, శ్రీ గీతాంజలి విద్యాసంస్థలు విద్యార్థులను వివేకానంద, ఠాగూర్, రామన్ మరియు మహావీర్ లాంటి ఉన్నత వ్యక్తుల వ్యక్తిత్వాలను విద్యార్థి నులను నాలుగు విభాగాలుగా విభజించి విద్యార్థుల మధ్య ఒక పోటీ ప్రపంచాన్ని నిలిపి వారి యొక్క బంగారు భవిష్యత్తుకు ఒక మార్గాన్ని ఏర్పరచినందుకు శ్రీ గీతాంజలి విద్యాసంస్థలకు అభినందనలు తెలియజేశారు. అలానే క్రీడల్లో రాణించిన విద్యార్థిని విద్యార్థులకు భవిష్యత్తులో కలిగే ప్రయోజనాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఆఫ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ , దీప, నాగరాజు , పిఇటి లు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



# తలకోనలో ఆనకట్ట నిర్మాణం అవసరం

- మూడు జిల్లాలకు నీటి భద్రతకై దేవర మనోహర్ విజ్ఞప్తి..

**నేటి సాక్షి తిరుపతి :** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని యర్రావారిపాళ్యం మండలం తలకోన జలపాతం, శేషాచలం పర్వత ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటిని సంరక్షించేందుకు ప్రభుత్వ స్థాయిలో సమగ్ర చర్యలు చేపట్టాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి చంద్రగిరి నియోజకవర్గం ఇన్చార్జ్ దేవర మనోహర్ విజ్ఞప్తి చేశారు. తగిన నీటి నిల్వ ఏర్పాట్లు లేకపోవడంతో ప్రతి సంవత్సరం లక్షల క్యూసెక్కుల నీరు వృథా అవుతుందని, ఫలితంగా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో తాగు నీరుసాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయని పేర్కొన్నారు. తలకోన నుంచి గాజులేరు, కప్పలేరు, వలసపల్లి ఏరు మార్గంగా ప్రవహించే వర్షపు నీరు చివరకు పింఛా ప్రాజెక్టు కు చేరుతుందని, కానీ నిల్వ సదుపాయాల కొరత కారణంగా పెద్ద మొత్తంలో నీరు సముద్రంలో కలిసిపోతుందని వివరించారు. మరోవైపు పైప్రాంత గ్రామాల్లో భూగర్భ జల మట్టం తగ్గిపోవడం, బోరు బావులు ఎండిపోవడం, పంటలు నష్టపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో సారవంతమైన భూములు విస్తారంగా ఉన్నప్పటికీ, అనిశ్చిత వర్షాలపై ఆధారపడక తప్పడం లేదంటున్నారు. నీటి కొరత కారణంగా వలసలు పెరుగుతున్నాయని, గ్రామీణ కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సిన పలు సూచనలు గురించి వివరించారు. తలకోన అటవీ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటిని నిల్వ చేసే ఆనకట్టలు/రిజర్వాయర్లు నిర్మించడం. ఇప్పటికే ఉన్న నిర్మాణాలను బలోపేతం చేసి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం. నిల్వ నీటిని చెరువులు, కాలువల ద్వారా పంపిణీ చేసి సుమారు 750 చెరువులకు ప్రయోజనం చేకూరేలా చేయడం. భూగర్భజలాలను పునఃభర్తీ చేస్తూ తాగునీటి లభ్యతనుమెరుగుపరచడం. “ఈ చర్యలు అమలు అయితే 3 జిల్లాల రైతులకు సాగునీరు లభించి, తాగునీటి భద్రత కలుగుతుంది. స్థిరమైన నీటి నిర్వహణలో ఇది ఒక పెద్ద మైలురాయిగా నిలుస్తుంది” అని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీర్ఘకాలిక మౌలిక వసతులపై ప్రభుత్వం దృష్టి సారిస్తే, భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని దేవర మనోహర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



# 252 జీఓ సవరించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

- 252జీఓ అమలు అక్రిడిటేషన్ల 10మంది వేల మందికి ముప్పు
- టీయుడబ్ల్యూజే హెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్



నేటి సాక్షి జగిత్యాల టౌన్: నూతన అక్రిడిటేషన్ల జారీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 252 జీవో కొన్ని నిబంధనలతోరాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మంది జర్నలిస్టులు అక్రిడిటేషన్లను కోల్పోయే ప్రమాదం ఏర్పడనుందని టీయుడబ్ల్యూజే హెచ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన 252 జీవోలో తక్షణమే సవరణ చేయాలని కోరుతూ శనివారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు ధర్నా చేశారు. ఈ ప్రజాస్వామ్య విలువలు, పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తూ ప్రభుత్వం నూతన అక్రిడేషన్ల కోసం జీవో జారీ చేయడం అభినందనీయమైన అంశమే అయినప్పటికీ, ఇందులోని కొన్ని నిబంధనలు జర్నలిస్టుల జీవనోపాధికి తీవ్ర ముప్పుగా మారాయని వారు పేర్కొన్నారు. గతంలో అమలులో ఉన్న జీవో నం.239 ప్రకారం పెద్ద పత్రికలకు 20 మంది కరస్పాండెంట్లు, 20 మంది డెస్క్ జర్నలిస్టులు, 4 మంది కెమెరామెన్లకు అక్రిడిటేషన్లు మంజూరు చేయగా, నూతన జీవో నం.252లో ఈ సంఖ్యను వరుసగా 12, 12, 3కి తగ్గించడం వల్ల అనేక మంది జర్నలిస్టులు అక్రిడిటేషన్ కోల్పోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇదే విధంగా జిల్లా స్థాయిలోనూ కోతలు విధించారని విమర్శించారు.

**జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ మాట్లాడుతూ**

మీడియం పత్రికలు, శాటిలైట్ ఛానళ్లకు కూడా గణనీయమైన తగ్గింపు విధించడమే కాకుండా, గతంలో కేబుల్ ఛానళ్లకు రాష్ట్ర స్థాయిలో ఐ & పి ఆర్ ద్వారా ఇచ్చే 12 అక్రిడిటేషన్లను పూర్తిగా రద్దు చేయడం ఆందోళనకరమన్నారు. జిల్లా ఎలాక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు దొమ్మాటి అంజుగౌడ్ మాట్లాడుతూ గతంలో ప్రసారాలు జరుగుతున్న కేబుల్ చానల్ కు ప్రతి జిల్లాకు నాలుగు అక్రిడిటేషన్లు మంజూరు చేయగా, ఇప్పుడు ఒక్క జిల్లాకు కేవలం రెండు మాత్రమే ఇవ్వడం వల్ల జర్నలిస్టులపై తీవ్ర ప్రభావం పడనుందని తెలిపారు. నేషనల్ కౌన్సిల్ మెంబర్ సిరిసిల్ల శ్రీనివాస్, కోరుట్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంతకుముందు నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు అక్రిడిటేషన్లు ఇచ్చేవారని, నూతన జీవోలో ఆ విధానాన్ని పూర్తిగా తొలగించడం అన్యాయమని విమర్శించారు. అలాగే ఒక లక్ష జనాభా ఉన్న మండలానికి ఒక అక్రిడిటేషన్, అంతకంటే ఎక్కువ జనాభా ఉంటే రెండో అక్రిడిటేషన్ ఇచ్చే విధానాన్ని కూడా రద్దు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా డెస్క్ జర్నలిస్టులను వేరు చేస్తూ ‘మీడియా కార్డు’ పేరిట విభజన తీసుకురావడం జర్నలిస్టు సమాజంలో తీవ్ర చర్చకు, అసంతృప్తికి దారితీస్తోందని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ ప్రతిష్ఠకు కూడా భంగం కలిగించే అవకాశముందని అభిప్రాయ పడ్డారు. 15 వేల కంటే తక్కువ సర్క్యులేషన్ ఉన్న చిన్న పత్రికలకు కూడా ఈ జీవో ద్వారా అన్యాయం జరుగుతోందని, గతంలో నియోజక వర్గ స్థాయిలో ఇచ్చే అక్రిడిటేషన్లు పూర్తిగా తొలగించడం వల్ల అనేక మంది జర్నలిస్టులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. డెస్క్, ఫీల్డ్ జర్నలిస్టులు అన్న తేడా లేకుండా అందరినీ అక్రిడిటెడ్ జర్నలిస్టులుగా గుర్తిస్తూ, జర్నలిస్టుల హక్కులు, గౌరవం, ఉపాధిని పరిరక్షించేలా జీవో నం.252లో తగిన సవరణలు చేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. గంగాధర్, కోరుకంటి విజయ్,కోశాధికారులు కటుకం రాజేశ్, గోపిగౌడ్ , ఎండీ సాజిద్, మెట్ పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు లక్కం మల్లేశం, శివకుమార్, పుల్లా శ్రీనివాస్, నవీన్, హరీష్, రత్నాకర్, కటుకం గణేష్,ప్రభాకర్,సంతోష్,ముకేశ్,జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టు లు పెద్దఎత్తున పాల్గొన్నారు.




# పెండిగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా




**నేటిసాక్షి, కరీంనగర్:** 2022, 2023 సంవత్సరాలకు సంబంధించిన లెప్రసీ, పల్స్ పోలియో బిల్లులను చెల్లించాలని శనివారం కరీంనగర్ కలెక్టరేటు ఎదుట సీఐటీయూ ఆశా వర్కర్లు ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ ఈ బిల్లులపై డీఎంహెచ్ఓ సమగ్ర విచారణ జరిపించాలని డిమాండు చేశారు. ఆశా వర్కర్లకు 18 వేల వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించేవరకు పోరాడుతామన్నారు. గర్భిణుల వివరాలను నమోదు చేయాలని ఆశా వర్కర్లను ఇబ్బంది పెట్టడం సరికాదని, వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు కూడా క్షేత్రస్థాయిలో పనిచేసి ఏఎన్సీ, పీఎన్సీ లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. ఎన్సీడీ సర్వేలు కూడా చేయాలనడం సరికాదని, పనిభారం పెంచినట్లు జీతాలను పెంచాలని కోరారు. యూనియన్ జిల్లా కార్యదర్శి మారెల్ల శ్రీలత, అధ్యక్షురాలు కాల్వ సారిక, పద్మ, లత, శ్యామల, సుమ, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్సై పి.తిరుపాలుకు ఘనంగా సన్మానం

**చేసిన పాములపాడు మండల టిడిపి నాయకులులి.**



**నేటి సాక్షి 27 డిసెంబర్ పాములపాడు:-** పాములపాడు మండల నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన పి.తిరుపాలు కు మండల కన్వీనర్- జి.రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో క్లస్టర్ ఇంచార్జీ హరినాథ్ రెడ్డి, రుద్రవరం సురేష్, తెలుగుయువత మండల అధ్యక్షుడు-షేక్.కరీంబాష, మండల నాయకులు మిట్టకందాల గ్రామ మాజీ సర్పంచ్ జి.హరిప్రసాద్ యాదవ్, సొసైటీ ల చైర్మన్లు సి.గోవిందు, లక్ష్మీకాంత రెడ్డి, లింగాల సర్పంచ్ మల్లీశ్వర రెడ్డి, స్వాములు, హాఫీజ్, ఏర్వ.నాగలక్ష్మి రెడ్డి, లింగస్వామి,ఆదిరెడ్డి, ఉన్నం రాము, గజ్జెల భాస్కర్ రెడ్డి, శివశంకర స్వామి, రంగస్వామి, రమేష్ నాయక్, బాలస్వామి, కాంట్రాక్టర్ కడుమూరి.గోపాల్ తదితర నాయకులతో, కార్యకర్తలతో కలసి శాలువాలు కప్పి, పూలమాలలు మెడలో వేసి, పుష్పగుచ్చాలు చేతికి అందించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేయడం జరిగింది

# నూతన ఎస్సై, పి.తిరుపాలుకు ఘనంగా సన్మానం

**వేంపెంట గ్రామ మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మలి**



**నేటి సాక్షి 27 డిసెంబర్ పాములపాడు:-** పాములపాడు మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన పి.తిరుపాలు కు సింగపూర్ తెలుగు సమాజం ఉ పాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు తరపున వేంపెంట గ్రామ మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ ఆధ్వర్యంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, నీటి సంఘం వైస్ ప్రెసిడెంట్ (డీసీ)ఆల్ఫ్రెడ్, బూత్ కన్వీనర్ బోనపల్లె వినయ్ కుమార్, బొమ్మ రాజేష్, వేమారెడ్డి, నులక యువరాజు, బోనాల భాస్కర్, జనసేన శేషు, సుబ్బారావు తదితర నాయకులతో, కార్యకర్తలతో కలిసి శాలువాలు కప్పి, పూలమాలలు మెడలో వేసి, పుష్పగుచ్ఛం చేతికి అందించి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

# పల్లె పండుగ సందర్భంగా సిసి రోడ్డులకు భూమిపూజ



**నేటి సాక్షి తిరుపతి వెదురుకుప్పం:** రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ విప్ జీడి.నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డా.వి.ఎం.థామస్ సూచనల మేరకు వెదురుకుప్పం మండలంలో మారేపల్లి హరిజనవాడలో 12.60 లక్షల, మొండి వెంగనపల్లి పంచాయతీ బండమీదఇండ్లులో 7.50 లక్షల సిమెంట్ రోడ్లకు పల్లెపండుగ సందర్భంగా వెదురుకుప్పం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మోహన్ మురళి సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేశారు మోహన్ మురళి మాట్లాడుతూ వెదురుకుప్పం మండలానికి గతం ఎప్పుడు లేని విధంగా స్థానిక ఎమ్మెల్యే డా.వి.ఎం.థామస్ నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు పరుగులు తీయించడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు ఈ కార్యక్రమంలో మారెపల్లి సర్పంచ్ అనుబురాసి, మొండివెంగనపల్లి ఉపసర్పంచ్ భాస్కర్ రెడ్డి, పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ మధుసూదన్ రెడ్డి, ఏపీఓ మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గిరి, బూత్ కన్వీనర్ పోటుగారి.శ్రీధర్,ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మిరెడ్డి, టిడిపి మండల కార్యనిర్వాక కార్యదర్శి విక్రమ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి,హరినాథ్, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా నేమురి శంకర్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు



మంచిర్యాల జిల్లా,, నేటి సాక్షి :చెన్నూర్‌లో తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ హిమాయిత్ నగర్ టిడిడి దేవాలయం ఎల్ఏసి చైర్మన్ నేమురి శంకర్ గౌడ్ 50వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ నాయకులు సిద్ధూ శంకర్ గౌడ్ పేరు మీద అర్చన కార్యక్రమం నిర్వహించి అనంతరం కేక్ కటింగ్ నిర్వహించరు శంకర్ గౌడ్ నిండు నూరేళ్లు చల్లగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఉన్నతమైన పదవులు అధిరోహించాలని సిద్ధూ అన్నారు, ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు నవీన్ గంధం సాయికిరణ్ మహేందర్ భాస్కర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# ప్రజల భద్రత కోసం చైనా మాంజపై నిషేధం



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్:** జగిత్యాల జిల్లాలో చైనా మంజా పూర్తిగా నిషేధించబడింది. ప్రజల,పక్షుల భద్రత పర్యావరణ సంరక్షణ కోసం ఈ నియమాన్ని కఠినంగా అమలు చేస్తున్నాం అని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ అన్నారు. జిల్లాలో చైనా మంజాను అమ్మినా, కొన్నాలేదా ఉపయోగించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని, ఎక్కడైనా చైనా మంజా విక్రయం లేదా నిల్వ ఉన్నట్లు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా 8712672000 నంబర్‌కు, డయల్ 100కి కానీ ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని మీ సమాచారం ఒక జీవితాన్ని కాపాడవచ్చని ఎస్పీ అన్నారు.

# భూ బాధితుల ఆధ్వర్యంలో ఘన సన్మానం



**నేటి సాక్షి,నారాయణపేట,:** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని 449 భూ బాధితుల ఆధ్వర్యంలో శనివారం నాడు నూతనంగా ఎన్నికైన మరికల్ గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు, అదేవిధంగా సిపిఎం జిల్లా నాయకులు వెంకట్రామారెడ్డి, బలరాములకు, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్య మోహన్ రెడ్డికి అదేవిధంగా మరికల్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు 449 బాధితుల ఆధ్వర్యంలో శాలువలతో పూలమాలలతో ఘనసన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ 449 బాధితులకు త్వరలోనే భూపాస్ పుస్తకాలు అందిలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు 449 బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో చక్కని ఆరోగ్యం



**నేటిసాక్షి, కరీంనగర్:** ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే చక్కని ఆరోగ్యంతో ఉంటారని కాంగ్రెస్‌నాయకుడు, వీఎన్నార్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వీ.నరేందర్‌రెడ్డి అన్నారు. 45 వడివిజన్‌లోఅజీమ్ ఆధ్వర్యంలో సన్‌రైజ్, శరత్ మాక్స్‌విజన్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, బత్తిని విష్ణుగౌడ్ అరవింద్ తొర్తి, తుమ్మల రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

# జీవో 252 సవరించాల్సిందే!

- జర్నలిస్టులకు అన్యాయం చేస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం తప్పదు
- టీయూడబ్ల్యూజే 143 జిల్లా అధ్యక్షులు గుండగోని జయశంకర్
- కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జర్నలిస్టుల భారీ నిరసన..
- కలెక్టర్ కు వినతిపత్రం



**నేటిసాక్షి, నల్లగొండ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జారీచేసిన జీవో ఎంఎస్ నెంబర్ 252 ను వెంటనే రద్దు చేసి, జర్నలిస్టులకు న్యాయం చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ టీయూడబ్ల్యూజే-H143 జిల్లా అధ్యక్షులు గుండగోని జయశంకర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు 252 జీవో సవరణ కోరుతూ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట జర్నలిస్ట్ లు భారీ నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, డెస్క్ జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగించే విధంగా తీసుకొచ్చిన జీఓ 252లోని నిబంధనలను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. జీఓ 252లో స్పష్టతలేని నిబంధనలు, అక్రిడేషన్ భారీ కోతలు, మీడియా అక్రిడేషన్ కార్డు, మీడియా కార్డు పేరుతో గందరగోళం సృష్టించారని ఆరోపించారు. రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేబుల్ ఛానెల్స్, పార్ట్‌టైం రిపోర్టర్లు, ఇండిపెండెంట్ జర్నలిస్టులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం వెంటనే గుర్తించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ అందేలా జీఓ. 252ను పునఃసమీక్షించి సవరించాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే, జర్నలిస్టుల హక్కుల సాధన కోసం రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా దీర్ఘకాలిక ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చేస్తామని హెచ్చరించారు. సమస్త జర్నలిస్టుల హక్కుల కోసం యూనియన్లకు అతీతంగా, ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. జర్నలిస్టులకు అన్యాయం చేస్తే ఊరుకోబోమని, హక్కుల సాధన కోసం ప్రాణ త్యాగానికైనా జర్నలిస్టులు సిద్ధంగా ఉన్నారన్నారు. జీఓ. 252లో గజిబిజి నిబంధనలతో జర్నలిస్టుల హక్కులకు భంగం కలిగించే ప్రయత్నాలను మానుకో వాలన్నారు.'మీడియా అక్రిడేషన్ కార్డు %-%మీడియా కార్డు' పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారని, ఏ కార్డు వల్ల ఏ ప్ర యోజనం అనే స్పష్టత లేదని విమర్శించారు. కొత్త నిబంధనలతో 10 వేలకుపైగా అక్రిడేషన్లు కోతపడే ప్రమాదం ఉందని, రిపోర్టర్లు%-%డెస్క్ జర్నలిస్టుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. కేబుల్ ఛానెల్స్, పా ర్ట్‌టైం రిపోర్టర్లకు తీవ్ర అన్యాయం జరగనుందని, ఇండిపెండెంట్ జర్నలిస్టుల అనుభవం 10 నుంచి 15 ఏళ్లకు పెంపుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మెజారిటీ జర్నలిస్టులు వ్యతిరేకిస్తున్న జీఓ 252ను వెంటనే సవరించాలని, ప్రభుత్వం స్పందించకపోతే దీర్ఘకాలిక ఆందోళనలకు వేనకాడేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు వీరస్వామి, శివకుమార్, అన్నబోయిన మట్టయ్య, మామిడి దుర్గా ప్రసాద్, బి.జనార్ధన్ రెడ్డి, నాగేశ్వర్ రావు, మేకల వరుణమ్మ, సురేష్, లక్ష్మీనారాయణ, సత్య, విజయ్, గాదె రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, గాలెంక గురుపాదం, రవికుమార్, లక్ష్మీనారాయణ, ఫోటో జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు వెంకటరమణ, ముచర్ల శ్రీనివాస్ గౌడ్, కారింగ్ శ్రీనివాస్ గౌ డ్, దండపల్లి రవికుమార్, మధు, డిజెటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు పగడాల సురేష్, ప్రధాన కార్యదర్శి తాడిశెట్టి లక్ష్మీ నారాయణ, సభ్యులు నరేందర్ రాజు, అజీజ్, నాగరాజు, సురేష్ వెంకటేశ్వర్లు జాకీర్, శ్రీనివాస్, సాయి, శీను, గిరి, టియూడబ్లుజే నియోజకవర్గ అధ్యక్షులు లక్షణ్, కొమ్ముగిరి, ప్రసన్న, ఆంజనేయులు, భిక్షం, వినోద్, సైదులు, జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అపోలో యూనివర్సిటీలో జాతీయ గణిత దినోత్సవం

**నేటి సాక్షి తిరుపతి చిత్తూరు:** అపోలో యూనివర్సిటీ, చిత్తూరులో క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు మాట్లాడుతూ, గణితం శాస్త్ర, సాంకేతిక రంగాలకు పునాదిగా నిలుస్తుందని అన్నారు. కష్టాల మధ్యన కూడా గణితంపై అచంచలమైన నమ్మకంతో రాణించిన రామానుజన్ జీవితం విద్యార్థులకు ఆదర్శమన్నారు. గణితశాస్త్ర అధ్యాపకులు డా. బి. నాగేశ్వరరావు రామానుజన్ చేసిన పరిశోధనలు, సంఖ్యలపై ఆయన కృషిని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణిత క్విజ్ పోటీలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పండిత్ మదన్‌మోహన్ మాలవీయ జయంతి

అపోలో యూనివర్సిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ క్లబ్ ఆధ్వర్యంలో పండిత్ మదన్ మోహన్ మాలవీయ జయంతిని శనివారం నిర్వహించారు. మాలవీయ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. బి. నాగేశ్వరరావు మాట్లాడుతూ, బనారస్ హిందూ యూనివర్సిటీ స్థాపన ద్వారా మాలవీయ విద్యకు గొప్ప దిశ చూపారని అన్నారు.ఏ. దివ్య మాలవీయ జీవితం, విలువలతో కూడిన విద్య ప్రాధాన్యతపై మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో పార్టీలో చేరికలు

**నేటి సాక్షి, జగిత్యాల టౌన్:** జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు మరియు జిల్లా తొలి జెడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో సారంగాపూర్ మండలం లక్ష్మిదేవి పల్లె గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మి మరియు 50 మంది వారి అనుచరులు కాంగ్రెస్ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది.ధర్మానాయక్ తండా నుండి చందు నాయక్ మరియు వారి అనుచరులు10 మంది కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో విసుగు చెంది మళ్ళీ కేసీఆర్ వస్తేనే పల్లెలు మరియు తండా లు అభివృద్ధి చెందుతాయని కాంగ్రెస్ పార్టీ నీ విడి దీ=ూ పార్టీ లో చేరడం జరిగిందని అన్నారు.రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అనే స్థాయిని మరిచిపోయి సోయి తప్పి అరుస్తున్నాడు. ఫ్రస్టేషన్ తో ఎందుకు ఉకిరిబిక్కి అవుతునావ్ కేసీఆర్ అడిగింది తెలంగాణ నీళ్లను ఆంధ్ర కు ఎట్లా అప్పజెప్పిన గుట్టు బయటపడింది.కాబట్టి ఫ్రెస్టేషన్ తో ఉక్కిరిబిక్కిరి అవుతునావ్. కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్ పెట్టి నిగ్గ తీసి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నావ్ .డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కాలయాపన చేస్తున్న గురు శిష్యుల బంధం బయటపడిందని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తేలు రాజు.సర్పంచ్ లు సంతోష్.భారతి. చిరంజీవి, దీ=ూ నాయకులు సాగి సత్యం రావు,చిట్ల రమణ,ధరిశెట్టి రాజేష్,మారు సాయి రెడ్డి, అనంతుల



గంగారెడ్డి,ఎండబెట్ల వర ప్రసాద్ భాస్కర్, బైరి మల్లేష్,జగన్ రమేష్, సాంబారి గంగాధర్,భీమా నర్సయ్య,తిరుపతి,జలంధర్, సుమన్ నాయక్,నరేష్ భాస్కర్ నాయక్, సురేష్, నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సంచార చికిత్సలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు

- నంద్యాల జిల్లా మేజేజర్ మహమ్మద్ రఫీ

**నేటి సాక్షి 27 డిసెంబర్ నంద్యాల:** నంద్యాల జిల్లా చంచారా చికిత్స లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలు నిరుద్యోగులకు ఒక సువర్ణ అవకాశం అని భవ్య యాజమాన్యం నంద్యాల జిల్లా మేనేజర్ మహమ్మద్ రఫీ, ఆపరేషన్ ఎక్సక్విట్ రవి కుమార్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 104 మొబైల్ మెడికల్ యూనిట్లు లో ఖాళీగా ఉన్న డ్రైవర్లు మరియు డేటా ఎంట్రీ ఆపరేటర్లు(డిఈ ఓ) పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. అర్హతలు (సంక్షిప్తంగా): డ్రైవర్: 10వ తరగతి, చెల్లుబాటు అయ్యే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ (శాలరీ–16,000/(పి. ఎమ్) డిగ్రీ, కంప్యూటర్ పరిజ్ఞానం -25 ఛ్రావీ-(శాలరీ–15,000/పి. యం) అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత

**ఎంపిక ప్రక్రియ:**

సర్టిఫికేట్ వెరిఫికేషన్ / ఇంటర్వ్యూ / డ్రైవింగ్ టెస్ట్ వేదిక: మార్కెట్ యార్డ్, గొల్లపూడి విజయవాడ :తేదీలు:26, 27, 28 డిసెంబర్ వేదిక తిరుపతి జిల్లా జిల్లా టీవీ కార్యాలయం రుయా తిరుపతి,

**తేదీలు:27 మరియు 28 డిసెంబర్ 2025**

అర్హులైన అభ్యర్థులు అవసరమైన ధృవపత్రాలతో నిర్ణీత తేదీల్లో వేదికకు హాజరుకావలసిందిగా భవ్య యాజమాన్యం తెలిపారు.

# స్వామియేయ్.. శరణమయ్యప్పా.

- అనునామ స్మరణతో పులకరించిన అయ్యప్ప గుట్ట
- వైభవంగా కోరుట్ల అయ్యప్ప స్వామి జాతర

**నేటి సాక్షి, కోరుట్ల:** కోరుట్ల పట్టణ శివారులోని అయ్యప్ప గుట్ట శనివారం 'శరణుఘోష'తో పులకించిపోయింది. అయ్యప్ప జాతర సందర్భంగా ఉదయం నుంచే '... స్వామియేయ్ శరణమయ్యప్పా'న్న నామస్మరణతో అలరారింది.

### కేరళ సంప్రదాయ పద్ధతిలో..

కేరళ రాష్ట్రంలోని శబరిమలై పుణ్యక్షేత్రంలో జరిపే మండల పూజను పురస్కరించుకొని జాత రమహోత్సవాన్ని పట్టణంలోని అయ్యప్ప గుట్టపై కొలువైన 'జ్ఞాన సరస్వతి–శనైశ్చరస్వామి సమేత అయ్యప్ప దేవాలయంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారుల మంత్రోత్చరణల మధ్య ఆలయ అభివృద్ధి కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో 'పదునెట్టాంబడి' మహోత్సవం భక్తుల కరతాళధ్వనుల మధ్య చూడముచ్చటగా సాగింది. జాతర మహోత్సవానికి కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు హాజరై అయ్యప్ప స్వామిని దర్శనం చేసుకున్నారు. ఉదయం దేవాలయంలో అయ్యప్ప, సుబ్ర హ్మణ్యం, గణపతి స్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, పంచామృత అభిషేకాలను నిర్వహించారు. అనంతరం పదునెట్టాంబడికి ప్రత్యేక పూజలు నిర్వహించి కర్పూర హారతులను అందించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన మహోత్సవ కార్యక్రమాన్ని నర్సింగరావుతో పాటు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య–అనిల్‌లు ప్రారం భించారు. అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథం ద్వారా అయ్యప్పగుట్ట ప్రాంతంలో రథయాత్ర నిర్వహించారు.






ఈ శోభయాత్రకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆలయ ప్రాంతంలో మహిషి మర్ధనం నిర్వహించారు. స్వామి వారికి పట్టణంలోని వివిధ దే వాలయాలు, అయ్యప్ప నిలయాల సభ్యులు, కుల సంఘాల సభ్యులు స్వామి వారికి వస్త్రాలను బహుకరించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కా ర్యక్రమంలో జ్ఞాన సరస్వతి, శనైశ్వర స్వామి అయ్యప్ప దేవాలయ అ య్యప్ప అభివృద్ధి కమిటి గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణ, అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ సభ్యులు పాల్గొన్నారు.

### పోలీసుల భారీ బందోబస్తు... సీసీ పుటేజీల ద్వార ప్రత్యేక పరవేక్షణ

అయ్యప్ప జాతర మహోత్సవానికి కోరుట్ల సర్కిల్ పరిధిలోని పోలీ సులు ప్రత్యేక బందోబస్తును నిర్వహించారు. సీఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో కోరుట్ల, కథలాపూర్ ఎస్ఐలు చిరంజీవి, రాంచందర్‌లు పో లీసులు బారీ బందోబస్తును నిర్వహించారు. సీసీ పుటేజీల ద్వార పర్యవేక్షించారు.

### జాతరకు 50 వేల మందికి పైగా హాజరు

అయ్యప్ప జాతరకు పలు ప్రాంతాల నుంచి దాదాపు 50 వేల మంది భక్తులు హాజరయ్యారు. వీరికి ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కుటుంబాలతో హాజరైన భక్తులు సంబరంగా గడిపారు. ఎటుచూసినా 'అయ్యప్ప గుట్ట' భక్తులతో కిటకిటలాడింది.



# తిరుపతి జిల్లాను తీర్చిదిద్దడమే ముఖ్య లక్ష్యం

- రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్, తిరుపతి (ఆర్‌టిఐ హెచ్) బోర్డు సమావేశం:
- జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్

**నేటి సాక్షి తిరుపతి:** శనివారం కలెక్టర్ మిని కాన్ఫిరెన్స్ హాలు నందు జరిగిన రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్' (ఆర్ టి ఐ హెచ్) పై బోర్డు డైరెక్టర్లతో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. 'రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్' (ఆర్ టి ఒ హెచ్) బోర్డు డైరెక్టర్ల సమీక్షా సమావేశం నిర్వహించి తిరుపతిని ఎలక్ట్రానిక్స్, స్పేస్ మరియు అడ్వాన్స్‌డ్ ఎనర్జీ సిస్టమ్స్ రంగాలలో అగ్రగామిగా నిలబెట్టడానికి బోర్డు పలు వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ప్రాధాన్యత రంగాలయిన ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ మరియు అడ్వాన్స్‌డ్ ఎనర్జీ సిస్టమ్స్ వంటి ప్రధాన రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని బోర్డు నిర్ణయించిదన్నారు. తిరుపతి జిల్లాతో పాటు



అనుబంధ జిల్లాల పారిశ్రామిక సామర్థ్యాన్ని అంచనా వేస్తూ, ఆ ప్రాంతాల్లో కూడా స్టార్టప్‌లు వ్యవస్థాపకతను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంచార్జి జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, ఆదాని, నవయుగ, అమర రాజా కంపెనీల నుండి ఐఐటి తిరుపతి బోర్డు సభ్యులు, సిఇఓ, ఆర్ టిఐహెచ్. తదితరులు పాల్గొన్నారు.

# నేడు రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం సర్వసభ్య సమావేశం

- ఆర్కేఎస్ఎస్ నూతన కార్యవర్గం ఎంపిక నేడే

**నేటి సాక్షి తిరుపతి:** తిరుచానూరు రోడ్డు మార్గంలోని శ్రీ బాలాజీ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10గంటలకు రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం (ఆర్కేఎస్ఎస్) సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు గౌరవాధ్యక్షులు శివరామరాజు, అధ్యక్షులు బలరామరాజు, కార్యదర్శి నారాయణ బాబు రాజు కార్యనిర్వహకులు తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ మాజీ జేఈఓ శ్రీనివాసరాజు, పుంగనూరు వెంకటరమణ రాజు, రాజంపేట జగన్మోహన్ రాజు ముఖ్య అతిధులుగా హాజరై ఎజెండా మేరకు సభను నిర్వహించి అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసి ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి క్షత్రియ సోదరులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన సభ్యత్వం,రెన్యువల్స్ చేపట్టి రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం సభ్యత్వ సంఖ్యను భారీగా పెంచనున్నట్లు తెలిపారు. మహిళా మణులకు ప్రాధాన్యత ఇచ్చి క్షాత్రాణుల బలోపేతానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు. పవిత్ర



పుణ్యక్షేత్రం తిరుపతి నగరంలో క్షత్రియ భవన నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో దానిని త్వరగా పూర్తిచేసి క్షత్రియ రాజులకు అందుబాటులోకి తీసుకువచ్చి సేవలు అందించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. సర్వసభ్య



సమావేశం అనంతరం విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి క్షత్రియ సోదర సోదరీమణులు హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# రీ సర్వేకు రైతులందరూ సహకరించాలి




**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రి సర్వే ను అధికారులకు రైతులు సహకరించాలని తెలుగుదేశం పార్టీ యువ నేత మాదిరాజు ప్రదీప్ రాజు అన్నారు శనివారం మండలంలోని పందిళ్ళపల్లి పంచాయతీ బాలసముద్రంలో రి సర్వే పై గ్రామసభ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఇప్పటివరకు గ్రామాలకు సంబంధించిన బౌండరీల రీ సర్వే జరిగిందన్నారు వచ్చే జనవరి 2 నుంచి రైతుల భూములకు సంబంధించిన సర్వే ఉంటుందన్నారు రైతులు తమ రికార్డులను తీసుకొని భూముల రిసర్వ్‌కి వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు అనంతరం ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించారు ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు

# ప్రీ స్కూల్ విద్య.. చిన్నారుల మానసిక అభివృద్ధికి మార్గం

### అర్బన్ సిడిపిఓ మమత



**నేటిసాక్షి, మిర్యాలగూడ:** అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందించే నాణ్యమైన ప్రీ స్కూల్ విద్య మానసిక అభివృద్ధికి దోహదం చేస్తుందని అర్బన్ సిడిపిఓ ఆర్. మమత అన్నారు. శనివారం మిర్యాలగూడ ప్రాజెక్ట్ పరిధిలోని ఎన్ఎస్పీ క్యాంప్ సెక్టార్ పరిధిలోని, ప్రకాష్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో బాల్య సంరక్షణ మరియు విద్య పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సిడిపిఓ మమత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రంలో పిల్లల యొక్క ప్రీ స్కూల్ ప్రాముఖ్యతను చిన్నారులకు, తల్లిదండ్రులకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలు ఆట, పాటల ద్వారా ప్రీ స్కూల్ విద్యను నేర్చుకోవడం ద్వారా పిల్లల యొక్క మానసిక అభివృద్ధి మంచిగా జరుగుతుందని, వారిలో సృజనాత్మక అభివృద్ధి చెందుతుందని వారికి వివరించారు. చిన్నారుల తల్లిదండ్రులకు వారి యొక్క పిల్లలు తయారుచేసిన ప్రీ స్కూల్ ఆక్టివిటీస్ అన్నీ ప్రదర్శించి వారికి చూపించారు. ప్రీ స్కూల్ పిల్లల యొక్క తల్లిదండ్రుల నుండి వారి యొక్క పిల్లలు కనబరిచే ప్రతిభను గురించి అడిగి తెలుసుకుని సంతోషాన్ని వ్యక్తపరచారు. అంగన్వాడీ కేంద్రాలలో నిర్వహించే ప్రతి ఒక్క కార్యక్రమాలు మరియు పౌష్టికాహారం గురించి అందరికీ ప్రదర్శించి చూపించారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ లీలా కుమారి, బ్లాక్ కో ఆర్డినేటర్ కవిత, అంగన్వాడీ టీచర్ రాణి, హెల్పర్ సౌందర్య, లబ్ధిదారులు పిల్లల యొక్క తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చౌడేపల్లిలో సీఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో ఫుట్ పెట్రోలింగ్



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** చౌడేపల్లి టౌన్‌లో సర్కిల్ కేంద్రమైనటువంటి చౌడేపల్లిలో శనివారం సీఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు సాయంత్రం పాఠశాలలు విడిచిన సమయంలో ఆకతాయిల ఆగడాలకు ఎవరు ఇబ్బంది పడకూడదని అలాంటి వారిపై చట్టరీత్యా చర్య తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ రాంభూపాల్ అన్నారు ఈ మేరకు బజారు వీధి బస్టాండు పలమనేరు ఆర్టీసీ బస్టాండ్ వరకు ఫుడ్ పెట్రోలింగ్ నిర్వహించారు పలమనేరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద అసాంఘిక కార్యక్రమాలు ఎవరైనా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఆ ప్రాంత ప్రజలను కోరారు పరిసరాలను నిశితంగా పరిశీలించారు చౌడేపల్లి బస్టాండ్ లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని దుకాణదారులు మట్టిని రోడ్లపై వేసి ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకు వెళ్లడంతో పంచాయతీ కార్యదర్శి దుకాణదారులను సమావేశపరిచి సమస్యను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో చౌడేపల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం

**పలికిన కాయం హరినాథ్ రెడ్డి**



**నేటి సాక్షి తిరుపతి:** విజ్ఞాన భారతి ఆధ్వర్యంలో తిరుపతి లోని రాష్ట్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం లో నిర్వహిస్తున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనం 2025 – అతిథిగా పాల్గొనడానికి విచ్చేసిన రాష్ట్ర వైద్య విద్య, ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ ని తిరుపతి విమానాశ్రయం లో బిజెపి నాయకులతో కలిసి ఘనంగా స్వాగతం పలికిన బీజేపీ జిల్లా కార్యదర్శి కాయం హరినాధరెడ్డి. మంత్రి ప్రతి ఒక్కరిని ఆప్యాయతగా పలకరిస్తూ జిల్లా పార్టీ విషయాలపై కొద్ది సమయం చర్చించి తదుపరి రోడ్డు మార్గాన భారతీయ విజ్ఞాన సమ్మేళన కార్యక్రమానికి బయలుదేరారు

# యూట్యూబ్ ఛానల్, భక్తి పాట ఆవిష్కరణ

**అంబారిపేట శ్రీవెంకటేశ్వర స్వామి వారి యుట్యూబ్ ఛానల్,**

**భక్తి పాటను ఆవిష్కరించిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్ .**



**నేటి సాక్షి - జగిత్యాల టౌన్:** జగిత్యాల అర్బన్ మండల అంబారిపేట శ్రీవెంకటేశ్వర స్వామి వారి మీద రూపొందించిన భక్తి పాటను, శ్రీవెంకటేశ్వర భక్తి యూట్యూబ్ చానల్ ను జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించిన జగిత్యాల శాసనసభ్యులు డా,సంజయ్ కుమార్.భక్తి పాట రూపొందించడానికి కృషి చేసిన, పాట రచన సిరికొండ రాజేశం,సింగర్ ప్రభ,సంగీతం సందీప్, సర్పంచ్, ఉప సర్పంచ్,వార్డు సభ్యులు, శ్రీ వెంకటేశ్వర ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులను ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అభినందించారు.

# ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక..






**నేటి సాక్షి ప్రతినిధి, రుద్రంగి :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గంను శనివారం రోజున ఎకాగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎలిగేటి సూర్యకిరణ్ క్లబ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షుడిగా ఎలిగేటి ప్రదీప్ ప్రధాన కార్యదర్శిగా ఆకుల గంగాధర్, కోశాధికారిగా పోగుల మోహన్, సలహాదారుడిగా తుమ్మనపల్లి శ్రీనివాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఎలిగేటి సూర్య కిరణ్ మాట్లాడుతూ...పాత్రికేయుల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. నూతన మండలంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణంతో పాటు పాత్రికేయులకు అక్రిడేషన్ కార్డులు, ఇండ్ల స్థలల కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు నంద్యాడపు అంజయ్య, బింగిశెట్టి వెంకటేష్, కుర్మచలం సత్యనారాయణ, సుడిగేపు పరుశురాంలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశికి ముస్తాబు

- **తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ..!**
- **ప్రత్యేక ఆకర్షణగా సిద్ధమవుతున్న వైకుంఠ ద్వారం**
- **ఆలయం వద్ద సాగుతున్న పనులు**

**నేటి సాక్షి తిరుపతి:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఆలయం లోపల, బయట ఏర్పాట్లు చురుగ్గా సాగుతుండటంతో ఆలయ వ్యవస్థాపకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే గర్భాలయంను శుద్ధి చేసిన అర్చకస్వాములు ఆయలంలోని పరివార దేవతామూర్తుల ఆలయాలను పరిశుభ్రం చేశారు. అలాగే అలంకార మండపంలోని స్వామి వారి వాహనాలను, ఆలయ పుష్కరణిని సుంగభరిత ద్రవ్యాలతో శుభ్రం చేశారు. ఆలయం ముందు ప్రత్యేకంగా ఇనుప బ్యారికేడ్లతో క్యూలైన్లు, చలువ పందిళ్లు, రంగ వల్లులతో తీర్చిదిద్ది వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరిస్తున్నారు. ప్రధాన ఆలయంతో పాటు వైకుంఠ ద్వారం, ధ్వజస్తంభం, పరివార దేవతామూర్తుల ఆలయాలకు జరిగే పుష్పాలంకరణకు దేశ, విదేశాల నుంచి పువ్వులను తీసుకువస్తున్నారు.


### వైకుంఠ ద్వారాన్ని సిద్ధం చేస్తున్న కార్మికులు

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి గర్భాలయం చుట్టు వున్న వైకుంఠ ద్వారాన్ని అందంగా పుష్పాలంకరణతో సిద్ధం చేస్తున్నారు. శంకు, చక్ర నామాలతో కూడా వైకుంఠ ద్వారం గుండా భక్తులు ప్రవేశించగానే భక్తితో మైమరిపించేలా గోవింద నామ సంకీర్తలతో పాటు సుగందాలను వెదజల్లే పుష్పాలు, పరిమళ బరిత పత్రాలను అమర్చడానికి వీలుగా ప్లై[?]డ్ ఏర్పాటు పనులు చేపట్టారు. వైకుంఠ ద్వారంలో అందమైన విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేస్తున్నారు.

### అర్ధరాత్రి ధనుర్మాస కైంకర్యాలు

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని 29వతేదీ అర్ధరాత్రి దాటిన తరువాత స్వామి వారికి ధనుర్మాస కైంకర్యాలు, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం వంటి దైనందిన పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఆ తరువాత తెల్లవారు జామున 4 గంటలకు వైకుంఠ ద్వారంకు ప్రత్యేక పూజలు చేసి ప్రారంభిస్తారు. ఆ తరువాత వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులను అనుమతిస్తారు.

### కనువిందు చేయనున్న దశావతారాలు



తుమ్మలగుంట గ్రామ శివార్లలో దశావతారాల విద్యుత్తు కటౌట్లు భక్తులకు కనువిందు చేయనున్నాయి. ఇప్పటికే విద్యుత్తు కటౌట్లను ఏర్పాటు చేయడానికి అవసరమైన ఎలక్ట్రికల్ పనులు ప్రారంభం కావడంతో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో విద్యుత్తు వెలుగులు మధ్యన దేవదేవుని దశావతారాలు భక్తులకు కనువిందు చేయనున్నాయి.

---

- **రైతులకు కాంటాలు కష్టమే దళారులకు గంటల్లో లారీలు!**
- **మిల్లర్లతో కుమ్మక్కై బస్తాలకు బేరం?**
- **నిర్వాహకులకు అండగా నిలిచిన అధికారులు ఎవరు?**



**నేటి సాక్షి మహబూబాబాద్:** మండలంలోని రామన్నగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న ఐకెపి వడ్ల కొనుగోలు కేంద్రం రైతులకు భరోసా కల్పించాల్సిన స్థానంలో దళారుల దందాకు వేదికగా మారిందన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం రైతుల నుంచి నేరుగా వడ్లు కొనుగోలు చేసి, మధ్యవర్తుల పాత్రను తొలగించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రస్తుతం అదే మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చిన రైతులు కాంటాలు వేయించుకోవడానికి, లారీలకు ఎత్తించడానికి రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తుండగా, దళారుల వడ్లకు మాత్రం ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే కాంటాలు వేసి లారీల్లో ఎత్తి తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రక్రియలో ఒక్కో బస్తాకు రూ.10 నుంచి రూ.30 వరకు ఒప్పందాలు కుదుర్చుకుని ఇప్పటికే మూడు లారీల మేర వడ్లను అక్రమంగా తరలించినట్లు సమాచారం. శుక్రవారం సాయంత్రం దళారులు రహస్యంగా కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన వడ్లను శనివారం చివరిదశలో కాంటాలు వేసి తరలించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై రైతులు ప్రశ్నించగా, నిర్వాహకులు మరియు దళారులు "వద్దు అనుకుంటే వడ్లు పోసుకోవద్దు" అన్నట్టుగా మాట్లాడారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, వారు స్పష్టమైన చర్యలు తీసుకోకుండా నిర్వాహకులను వెనకేసుకొచ్చిన తీరు అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇంకా, మిల్లర్లతో కుమ్మక్కై గ్రామ రైతుల పేర్లపై ఆన్[?]లైన్ ఎంట్రీలు చేసి, వాస్తవానికి దళారుల వడ్లను తరలిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. బస్తాలు కూడా వేయకుండా వడ్లు పంపించి మిల్లర్ల నుంచి ముడుపులు తీసుకుంటూ ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం కలిగిస్తున్నారని మండల ప్రజలు మండిపడుతున్నారు. ఈ అక్రమాలు మండల స్థాయి అధికారుల దృష్టికి వచ్చినప్పటికీ, చూసిచూడనట్లుగా వదిలేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఐకెపి నిర్వాహకులు, సంబంధిత అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నారు. ఈ విషయంపై ఏపిఎం రాములు స్పందిస్తూ, నరసింహపురం గ్రామానికి చెందిన శీను అనే వ్యక్తి 200 బస్తాలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన విషయం గుర్తించినట్లు తెలిపారు. అవి ప్రైవేటు వ్యక్తుల వడ్లుగా నిర్ధారణ కావడంతో వెంటనే తిరిగి పంపించినట్లు చెప్పారు. భవిష్యత్తులో కొనుగోలు కేంద్రంలో ప్రైవేటు వ్యక్తుల వడ్లు పోసినట్లు తెలిసినట్లయితే జిల్లా అధికారులకు తెలియజేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలి.

- **మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.**

**నేటి సాక్షి వికారాబాద్:** మాజీ మంత్రివర్యులు సబితా ఇంద్రారెడ్డి తో కలిసి వికారాబాద్ పట్టణంలో పర్యటించిన వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, రంగారెడ్డి జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నరేందర్ రెడ్డి మహేష్ రెడ్డి.అనంతరం వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లిలోని బీఆర్ ఎస్ భవన్ (జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయం)లో మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో భాగంగా వికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కింది విధంగా స్పందించారు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్ పైన కుట్రలు మాని, నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలి. జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి దారుణంగా ఉంది. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి మంజురైన సెంట్రల్ డ్రగ్ స్టోర్, డయాలసిస్ సెంటర్, డయాగ్నస్టిక్స్ సెంటర్, బ్లడ్ బ్యాంకు లలో ఫ్రిడ్జ్, బ్లడ్ సేకరించటానికి అవసరమైన పరికరాలు వెంటనే ఏర్పాటు చెయ్యాలని కోరారు. ఈ వసతులు లేక పేషెంట్లు ప్రైవేటు ఆసుపత్రిలకి వెళ్లి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాల్సి వస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంజూరు చేయించిన జెనరేటర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటి వరకు రాలేదు. రైన పర్యవేక్షణ లేక వికారాబాద్ సాకేత్ నగర్ లో నిరుపయోగంగా మారిన జిమ్ పార్క్‌ను మరమ్మతులు చేసి వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని అధికారులను కోరారు. కెసిఆర్ హయాంలో అమ్మఒడి పథకంద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా గర్భవతుల/ బాలింతల సంరక్షణ కోసం ప్రభుత్వ వాహనాలు పెట్టి ఇంటి నుండి ఆసుపత్రికి తీసుకు వచ్చి, అవసరం అయినా అన్ని పరీక్షలు ఉచితంగా చేసి, తిరిగి వారిని ఇంటి దగ్గర దింపేది. కెసిఆర్ హయాంలో గర్భవతులకి కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ అలాగే తల్లి బిడ్డ సంరక్షణ కోసం కెసిఆర్ కిట్ అందించి వారి ఆరోగ్యం మీద దృష్టి సారించారు. ఇప్పుడు అవి పూర్తిగా మాయమయ్యాయి. కెసిఆర్ హయాంలో దాదాపు 100 కోట్ల వ్యయంతో మంజూరైనటువంటి రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు రెండు సంవత్సరాలు ముగిసిన ఇంకా నత్త నడకన సాగుతూనే ఉన్నాయి, బ్రిడ్జి పనులలో వేగం పెంచి తొందరగా పూర్తి అయ్యేలా చూడాలి. వేల కోట్లు ఖర్చుపెట్టి మూసి సుందరీకరణ చేస్తానన్న రేవంత్ రెడ్డి వికారాబాద్‌లో ఉన్న మూసీ నది జన్మస్థలన్ని గాలికి వదిలేసారని మడ్డిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ , జిల్లా రైతు బంధు మాజీ అధ్యక్షులు రామ్ రెడ్డి, నాయకులు క్యామ మల్లేశం బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.




# డిసెంబర్ 31న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ

- **కలెక్టర్ నిశాంత్ కుమార్**

నేటి సాక్షి, అన్నమయ్య,: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పథకం కింద డిసెంబర్ నెలకు సంబంధించిన పెన్షన్లను డిసెంబర్ 31వ తేదీన ఒకరోజు ముందుగానే పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పెన్షన్ దారులందరూ డిసెంబర్ 31న తమ ఇళ్ల వద్దనే అందుబాటులో ఉండి పెన్షన్ తీసుకోవాలని ఆయన సూచించారు. పెన్షన్ కోసం సచివాలయాలకు లేదా ఇతర కార్యాలయాలకు వెళ్లొద్దని ప్రతి లబ్ధిదారునికీ ఇంటి వద్దనే పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు. పెన్షన్ల పంపిణీ సజావుగా జరిగేలా ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బంది, డిఆర్డిఏ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు..



# కొత్త సంవత్సరం వేడుకలపై పోలీసు వారి సూచనలు పాటించాలి

- **జిల్లా ఎస్పీ నితికా పంత్**

**కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా:** నేటి సాక్షి, కొమురం భీమ్ ఆసిఫాబాద్:ఆసిఫాబాద్ జిల్లా ప్రజలకు తెలియజేయునది ఏమనగా నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మత్తులో రోడ్లపై వేగంగా, ఇష్టారాజ్యాంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులు కాకూడదులి. జిల్లా పోలీసులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అప్రమత్తమై పక్క కార్యాచరణతో రంగంలోనికి దిగుతున్నారు. నూతన సంవత్సర వేడుకలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఏవరైన అతిక్రమించినా వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ గారు హెచ్చరించారు ముఖ్యంగా యువకులు నిబంధనలకులోబడి మాత్రమే వేడుకలు జరుపుకోవాలని ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడవద్దని, పోలీసుల వారి నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని హెచ్చరించారు రౌడీ షీటర్లు మరియు అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తులపైన సీసీటీవీ మరియు కమాండ్ కంట్రోలింగ్ ద్వారా వారి పైన నిఘా ఉంటుందని ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఎవరైనా అతిక్రమించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారులి

### పోలీస్ వారి సూచనలు:

1) బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం నిషేదం

2) మైనర్లు, యువకులకు బైకులు ఇవ్వడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. కావున తల్లి దండ్రులు మైనర్ యువకులకు బైకులు ఇవ్వవద్దు. పట్టుబడితే మైనరు పై మరియు వాహనం. యాజమానిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది.

3) ట్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహానాలు నడపడం శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వాహానాలు సీజ్ చేయనున్నారు..

4) అధిక వేగంతో వాహానాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయి. కావున నెమ్మదిగా నడపాలి.

5)మద్యం తాగి వాహానాలు నడపొద్దు. జిల్లావ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తాము.

6) గుంపులు గుంపులుగా రోడ్లపై కేకలు వేస్తే తిరగడం, వాహానాలతో ర్యాలీగా వెళ్లడం చేయరాదు..

7) ఎక్కడకూడా పోలీస్ అనుమతి లేకుండా న్యూ ఇయర్ కార్యక్రమములు నిర్వహించరాదు. ఫామ్ హౌస్ , క్లబ్స్ మరియు గేటేడ్ కమ్యూనిటీలో అనుమతిలేకుండా నూతన సంవత్సర కార్యక్రమాలు నిర్వహించరాదు. వాటిని కూడా పరిమితి మించకుండా సౌండ్ వాడరాదు.

8) ప్రజలను భయాందోలనకు, ఇబ్బందులకు గురి అయ్యే విధంగా క్రాకర్స్ మరియు " ఆర్.కె స్ట్రా" సౌండ్ సిస్టమ్ లేదా అత్యధిక మొతాదులో గల సౌండ్ సిస్టమ్ (డి.జె ) ఏర్పాట్లు నిషేధించడం జరిగింది. ఎందుకంటే కొన్ని ప్రదేశాలలో వృద్ధులు లేదా అనారోగ్యంతో బాదపడుతున్నవారికి ప్రాణాలకు ముప్పువాటిల్లే అవకాశంగలదు.

### ట్రాఫిక్ నిబంధనలు:

ఆసిఫాబాద్ జిల్లా పరిధిలలో ముఖ్యంగా నూతన సంవత్సర వేడుకలను ఎక్కువ నిర్వహించే అవకాశం ఉంటుంది. కావున ఈ వేడుకల సందర్భంగా ప్రతీ వాహనాదారుడు తూ.చ తప్పకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా పోలీసు సిబ్బంది చర్యలు తీసుకోనున్నారు. జిల్లా పరిధిలో ట్రాఫిక్ నియమాలు మరియు నిబంధనలు అమలు తీరును మరింత పటిష్టంగా అమలుపర్చాల్సి ఉంటుంది. ప్రధాన జంక్షన్లలో డ్రంకన్ డ్రైవ్ మరియు రోడ్లపై గస్తీ నిర్వహించడం జరుగుతుంది.

### స్పెషల్ పార్టీలు:



అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలలో సాయంత్రం 6 గంటల నుండి ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి వాహానాల తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపట్టనున్నాము. డ్రంక్ అండ్ డ్రైవ్ సందర్భం గా ఫోటో గ్రాఫి మరియు వీడియో గ్రాఫీలు తీసిన తర్వాత వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని, పోలీస్ వారి నిబంధనలు ఎవ్వరయిన అతిక్రమించిన వారిపై చట్టరిత్య చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. జిల్లా ప్రజలు పైన తెలియజేయబడిన నిబంధనలు తప్పకుండా పాటిస్తూ సంబంధిత పోలీస్ వారికి సహకరించగలరని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపిఎస్ తెలిపారు

# దర్గా ఉర్సు ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీక..

- **ద్వారకానాథ్ రెడ్డి వ్యాఖ్యలు**
- **దర్గా ఉత్సవాల నిర్వహణకు 20 వేలు అందించి తనలోని భక్తిని చాటిన - తంబళ్లపల్లి శాసనసభ్యులు**

**నేటి సాక్షి, అన్నమయ్య.:** స్థానిక నియోజకవర్గ పరిధిలోని మొలకలచెరువు మండల కేంద్రమైన పెద్ద పాళ్యం గ్రామంలో గల సులేమాన్ షావలి దర్గా వద్ద జరుగుతున్న ఉర్సే షరీఫ్ కార్యక్రమంలో భాగంగా దర్గా వద్ద చాథర్ సమర్పించారు. అంతకు ముందు ముస్లిం మైనార్టీలకు ఆరాధ్యమైన దర్గా లో ప్రత్యేక పూజలు నిర్వహించి చాదర్ సమర్పించేందుకు మత గురువులు, ముతవల్లీలు, దర్గా కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి అనుచరులతో కలిసి శనివారం గ్రామానికి చేరుకున్నారు. దర్గా వద్దకు విచ్చేసిన ద్వారకానాథ్ రెడ్డిని మండల వైసీపీ శ్రేణులు, గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. ఛాదర్‌ను పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి మోసుకుంటూ దర్గాలోకి ప్రవేశించారు. స్వామికి చాదర్ ను ముజావర్లతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముజావర్లు దర్గా ప్రాశస్త్యం, విశిష్టతను తెలిపారు. దర్గాలో మత గురువులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మత గురువుల ఆశీస్సులు స్వీకరించారు. దర్గా ఉర్సు ఉత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ద్వారకానాథ్ రెడ్డి పేర్కొన్నారు. పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి మతసామరస్యానికి ప్రతికగా దర్గా ఉత్సవాల నిర్వహణకు 20 వేలు అందించి తనలోని భక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి ఆముదాల మధుసూదన్ రెడ్డి, ములకలచెరువు మండలాధ్యక్షుడు కోటిరెడ్డి మాధవరెడ్డి, జడ్పీటీసీ మోహన్ రెడ్డి, ఎంపీపీ సాయి లీల, రాష్ట్ర రెడ్డి కమ్యూనిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ జయసింహా రెడ్డి, టంగుటూరి విశ్వనాథ్, వడిగల ప్రతాప్ రెడ్డి, సర్పంచులు విజయ రవి శేఖర్ రెడ్డి, సునీత సుదర్శన్ రెడ్డి, కోనంగి మంజుల రామనాథం, బూత్ కమిటీ అధ్యక్షుడు బోనాల చాంద్ భాష, మల్లికార్జున్ రెడ్డి, జేసీబీ మంజునాథ్ నాయుడు, ఫక్రుద్దీన్, కోనంగి శ్రీనివాసులు,



నాయి బ్రాహ్మణుల అధ్యక్షుడు చింతకుంట్ల నాగేంద్ర, యాసీన్, లవ కుమార్‌లు హాజరయ్యారు.

# పీపీపీ విధానంలో అమలు చేస్తామని చెప్పడం సిగ్గు చేటు..

- **మదనపల్లి ఏరియా ఆస్పత్రి లోని మహిళా శవాన్ని సందర్శించిన - నిస్సార్ అహ్మద్**

**నేటి సాక్షి, అన్నమయ్య, :** మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చి మహిళ మృతి చెందిన ఘటన విచారకరమని మదనపల్లి వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. మదనపల్లె జిల్లా ఆసుపత్రిల చికిత్సకని వచ్చిన మహిళ వైద్యం అందక వరండాలో పండుకొని చలికి తట్టుకోలేక ప్రాణాలు విడిచిన ఘటన మానవీయతకు మాయని మచ్చగా మిగిలిపోతుందని నిస్సార్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన అనుచరులతో కలిసి ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించారు. శనివారం సాయంత్రం అవెన్యూ రోడ్డు లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిస్సార్ అహ్మద్ విలేఖరులతో మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గం బలకవారిపల్లికి చెందిన మల్లమ్మ శుక్రవారం ఆసుపత్రికి చికిత్స కోసమని రావడం జరిగిందని ఆసుపత్రి సిబ్బంది చికిత్స అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆమెను ఆస్పత్రి లోపల పడుకోబెట్టకుండా ఆసుపత్రి వరండాలో పడుకోమని చెప్పడంతో విధిలేక ఆస్పత్రి వరండాలో విశ్రాంతి తీసుకుంది. చలికి తట్టుకోలేక ప్రాణాలు విడిచింది. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం అందక మృతి చెందిన ఘటనపై కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని నిస్సార్ అహ్మద్ డిమాండ్ చేశారు. భాదిత కుటుంబానికి ప్రభుత్వం పరిహారం అందజేయాలని, భాద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలా వుంటే పీపీపీ విధానం వస్తే ఎలా వుంటుందో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలు తీసుకొనివస్తే వాటిని ప్రభుత్వం నిర్వహించకుండా పీపీపీ విధానంలో అమలు చేస్తామని చెప్పడం సిగ్గు చేటు అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు నిర్వహిస్తే జగన్



మోహన్ రెడ్డి కి పేరు వస్తుందనే సిఎం చంద్రబాబునాయుడు పీపీపీ విధానంలో అమలు చేయడానికి చూస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్వహించే హాస్పిటల్లో ఇలావుంటే, పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు వస్తే ఇంకా దుర్భరమైన ఘటనలు చోటు చేసుకుంటాయని నిస్సార్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు..

# ఐపీఎస్ అధికారులకు బాగానే ఇచ్చి పడేసాడు

- **ఐఏఎస్ అధికారులపై టీడీపీ నేత దీపక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దేనికి నిదర్శనం..**
- **రాజకీయ, అధికార వర్గాల్లో పెను ప్రకంపనలు..**

**నేటి సాక్షి, అన్నమయ్య జిల్లా:** ఏపీలోని ఐఏఎస్ అధికారుల పనితీరుపై మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత ఏపీ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ, అధికార వర్గాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఓ ప్రముఖ యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఐఏఎస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులు వ్యవస్థకు పట్టిన శని గ్రహణంలా అభివర్ణిస్తూ దరిద్రంలా తయారయ్యారని ఘాటుగా విమర్శించారు. ఐఏఎస్ అధికారులపై టీడీపీ నేత దీపక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సంచలనాలే సృష్టిస్తుందని వివిధ పార్టీ సీనియర్ నేతలు అంటున్నారు. దొంగలు, దరిద్రం చుట్టుకున్నట్టు చుట్టుకున్నారంటూ ఆయన చేసిన ఘాటు వ్యాఖ్యలు ఐపీఎస్ అధికారులను ఎక్కడో తాకినట్టు ఉంటుందని పార్టీ సీనియర్ నాయకులు అంటున్నారు. ఏమీ రోగం నీతులు మాట్లాడుతారు. డ్రామాలు ఆడుతారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఐపీఎస్ అధికారులకు బాగా తగిలేటట్టు ఉందని వివిధ పార్టీ సీనియర్ నేతలు అంటున్నారు. తన వ్యక్తిగత అనుభవాన్ని వివరిస్తూ సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న తనకు గత 14 నెలలుగా జీతం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఫైనాన్స్ సెక్రటరీకి ఎన్నిసార్లు చెప్పినా ఫైల్ క్లియర్ చేయడం లేదని మండిపడ్డారు. "14 నెలలైనా ఒక చిన్న ఫైల్ క్లియర్ చేయలేని వారికి అసలు ఆ సీట్లో కూర్చునే అర్హత ఉందా?" అని నిలదీశారు. మెజార్టీ ఐఏఎస్ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని దీపక్ రెడ్డి ఆరోపించారు. కేవలం డబ్బు కోసమే ఫైళ్లను ఆపేస్తూ, పాలనను బాటిల్‌నెక్‌గా మారుస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో ఆయన ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టారు. "ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి తన కూతురి పెళ్లికి రూ.1000 కోట్ల కట్నం ఇస్తానని స్వయంగా నాతోనే చెప్పారు. ఇలాంటి దొంగలు వ్యవస్థలో చాలా మంది ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజా ప్రతినిధులు,




ప్రజల కోసం పనిచేయాల్సిన కలెక్టర్లు, ఐఏఎస్‌లు ఇలా వ్యవహరించడం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వంలో కీలక పదవిలో ఉన్న దీపక్ రెడ్డి సొంత ప్రభుత్వ అధికారులపైనే ఈ స్థాయి విమర్శలు చేయడం ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది..

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



**నేటిసాక్షి , జగదేవపూర్:** అంగన్వాడి కేంద్రాలోనే పౌష్టికహారం అందుతుందని గ్రామ సర్పంచ్ కుడుదుల రజిత అన్నారు. శనివారం జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రజిత మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం అందుతుందన్నారు. పౌష్టికాహారం తోనే తల్లులు పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. ఆరేళ్లు లోపు పిల్లలను తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. అంగన్ వాడి ద్వారా వచ్చే పౌష్టికారం గర్భిణీ స్త్రీలు తప్పకుండా తీసుకోవాలని పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని పుట్టబోయే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అనంతరం నూతన సర్పంచి రజితను అంగన్వాడి టీచర్ సాల్వతో సత్కరించారు. కార్యక్రమంలో టీచర్ రుక్మిణి, ఆయా బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచికి సన్మానం



**నేటిసాక్షి,జగదేవపూర్ :** జగదేవపూర్ మండలం తిగుల్ నూతనంగా ఎన్నికైన సర్పంచ్ కుడుదుల రజితను, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డిని శనివారం రైతుబంధు మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద గ్రామపంచాయతీ అయిన తీగుల్లో భారీ మెజార్టీతో రజిత గెలవడం అభినందనీయమన్నారు. గ్రామ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తూ మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆదర్శ గ్రామం వైపు అడుగులు వేయాలని ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ప్రజా నాయకురాలుగా పనిచేయాలని సూచించారు. రాజకీయంగా మరింత ఎదగాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లయ్య పిఎసిఎస్ మాజీ డైరెక్టర్ భూమయ్య గ్రామ నాయకులు మల్లారెడ్డి మహేందర్ రెడ్డి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## టిఫిన్ సెంటర్‌లో గ్యాస్ లీక్..

### ప్రాణాలకు తెగించి మంటలు ఆర్పిన బ్లూకోల్ట్ సిబ్బంది..

**నేటిసాక్షిప్రతినిధి చందుర్తి:** చందుర్తి మండలంలోని జోగాపూర్ గ్రామంలో పెను ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన గడ్డం మల్లేశం నిర్వహిస్తున్న టిఫిన్ సెంటర్‌లో శనివారం ప్రమాదవశాత్తు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనకు



గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన బాధితులు డైల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే చందుర్తి బ్లూకోల్ట్ సిబ్బంది పీసీ ఎండీ. సమీ, హెచ్‌జీ. నజీర్‌లు నిమిషాల వ్యవధిలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలు మరింత వ్యాప్తి చెందకుండా, ప్రాణాలకు తెగించి తడి గోనె సంచులతో మంటలను కప్పి వేసి నేర్పుగా అదుపు చేశారు. పోలీసుల సకాలం స్పందనతో భారీ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో స్పందించి సాహసోపేతంగా మంటలను ఆర్పిన బ్లూకోల్ట్ సిబ్బందిని చందుర్తి ఎస్సై జె. రమేష్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అభినందించారు. పోలీసుల చొరవను జోగాపూర్ గ్రామస్తులు కొనియాడారు.

## గన్నేరువరం సర్పంచ్‌కి సన్మానం



**నేటి సాక్షి గన్నేరువరం:** మానకొండూర్ మాజీ శాసనసభ్యులు రసమయి బాలకిషన్ అలాగే వార్డు సభ్యులు ఘనంగా సన్మానం చేశారు పార్టీ మండల అధ్యక్షులు గంప వెంకన్న మాజీ జెడ్పిటిసి మాడుగుల రవీందర్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ సప్నా సుధాకర్ మీసాల ప్రభాకర్ గుడెల్లి ఆంజనేయులు టిఆర్ఎస్ నాయకులు విక్రం రెడ్డి గూడూరి సురేష్ గొల్లపల్లి రవి సమ్మెట అనిల్ తాడూరి వంశీకృష్ణారెడ్డి బెజ్జంకి మండల అధ్యక్షుడు పాకాల మైపాల్ రెడ్డి మునిగంటి మల్లయ్య నల్లగొని మల్లయ్య రామంచ ఈ దయ ఘర్షకుర్తి లక్ష్మణ్ బాలయ్య శ్రీనివాస్ తదితరు పాల్గొన్నారు

# గోకులం షెడ్లతో రైతుకు ప్రయోజనం



**నేటి సాక్షి పాములపాడ:** గ్రామీణ ప్రాంతాల్లో గోకులం షెడ్లతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. శనివారం మండలంలోని మద్దూరు గ్రామంలో రూ.10 లక్షలతో ఐదు మినీ గోకులం షెడ్లను నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య, నందికొట్కూరు సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల సంక్షేమం, పాడి పశువుల అభివృద్ధి కోసం రాయితీ కింద చేపట్టిన గోకులం షెడ్ల నిర్మాణాలతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు పాల్గొనడం జరిగింది.

# అంగన్వాడిల్లో ఐసీసీఈ కార్యక్రమాలు



**నేటి సాక్షి, అన్నమయ్య:** స్థానిక నియోజకవర్గ పరిధిలోని బి. కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ములకలచెరువు మండల కేంద్రంలోని అన్ని అంగన్వాడి కేంద్రాలలో (ఐసీసీఈ) చిన్నపిల్లల సంరక్షణ మరియు విద్యా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ భాగ్యమ్మ తెలిపారు. శనివారం మండలంలోని వేపూరికోట పంచాయతీ రెడ్డివారిపల్లి అంగన్వాడి కేంద్రంలో ఇసీసిఇఈసీసీఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యమ్మ మాట్లాడుతూ 3నుండి 6సంవత్సరాల లోపు పిల్లలకు పాఠశాలలోని వస్తువుల ద్వారా పాత పాటలు, బొమ్మల ద్వారా ప్రీస్కూల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా పిల్లలకు శారీరకా అభివృద్ధి, భాషా వృద్ధి, మేధావృద్ధి, సృజనాత్మకాభివృద్ధి, సాంఘిక భావోద్వేగా అభివృద్ధిల గురించి పిల్లలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. అన్ని అంగన్వాడి కేంద్రాలలో ఈ కార్యక్రమాలను విరివిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు చిన్న పిల్లలకు విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ భాగ్యమ్మ, అంగన్వాడి టీచర్ వెంకటరమణమ్మ, లలితమ్మ, హెల్పర్ శైలజ, ఈశ్వరమ్మ, పిల్లల తల్లులు పాల్గొన్నారు..

# కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

డీసీసీ అధ్యక్షుడు 'మేడిపల్లి'



నేటిసాక్షి, కరీంనగర్: రానున్న మున్సిపల్ ఎన్నికల్లో గెలిచి కరీంనగర్ కార్పొరేషన్‌పై కాంగ్రెస్ జెండాను ఎగరవేయడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యం స్పష్టం చేశారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లను 6 జోన్లుగా విభజించామని, ప్రతీ జోన్‌కు ముగ్గురు సభ్యులను నియమించనున్నామని పేర్కొన్నారు. ఒకరు సెక్రటరీ, ఇద్దరు సెక్రటరీలుగా వ్యవహరిస్తారని, కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపునిచ్చి, పదవుల్లో అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రతినిధులు నమిండ్ల శ్రీనివాస్, రుద్ర సంతోష్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆరెపల్లి మోహన్, వైద్యుల అంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్‌తో బైక్ దగ్ధం

**నేటి సాక్షి, నల్లబెల్లి:** నందిగామ గ్రామానికి చెందిన బొగ్గుల చిన్న కార్తి ఇంటి వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా బైక్, ఇంట్లోని వస్తువులు దగ్ధమై సుమారు రూ.80,000 నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ భూక్యా భాస్కర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగిలి మోహన్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చి, సహాయానికి ముందుకు రావాలని గ్రామస్తులను కోరారు.



# టీడీపీ సుగవాసిని కలిసిన టీడీపీ నాయకులు



**నేటి సాక్షి అన్నమయ్య:** రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబును శుక్రవారం తంబళ్లపల్లి నియోజకవర్గ పరిధిలోని బి. కొత్తకోట టీడీపీ నాయకులు వివిధ వాహనాల్లో భారీగా వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దుశ్శాలువలు కప్పి పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బి. కొత్తకోట మండలంలో పార్టీ దుస్థితి పై వైసీపీ నాయకుల అరాచకాలు వారి దౌర్జన్యాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మీరు జోక్యం చేసుకొని పార్టీని గాడిలో పెట్టాలని కోరారు. అలాగే బి. కొత్తకోట పంచాయతీ ఉన్నపలంగా నగర పంచాయతీగా మారడంతో ఎలాంటి అభివృద్ధి లేదని నగర పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ శాఖ మంత్రి కి నగర పంచాయతీ అభివృద్ధిపై చర్చించి నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేయాలని నాయకులు కోరారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీలోన మీరు పర్యటించి పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించాలని దీంతో కార్యకర్తలు ఉత్సాహంతో ముందుకు సాగుతారని ఆయనకు తెలిపారు. దీనిపై స్పందించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఎవరు అధైర్య పడాల్సిన పనిలేదని త్వరలో మండలంలో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దాదం లోకనాథ్ రెడ్డి, బాయి గడ్డ శివరామిరెడ్డి, మాజీ సర్పంచులు ఆనంద్ రెడ్డి, మస్తాన్ రెడ్డి, నాయకులు డెరింగుల ఓబులేసు, మరవపల్లి మస్తాన్ రెడ్డి, జిల్లా టీడీపీ కార్యదర్శి ఎండీ మస్తాన్ సిద్ధారెడ్డి, భయ్యా రెడ్డి, ప్రతాప్, ఆది, రామచంద్ర, సున్నపు కిట్ట, నల్లగుట్టపల్లి అమర, నరసింహారెడ్డి, వాసు, ప్రభాకర్ నాయుడు, వెంకటేశ్వర్ రెడ్డి, బాబు రెడ్డి, రెడ్డి శేఖర్, ఎం ఎస్ ఆర్ నాయనబావి కృష్ణారెడ్డితో సహా భారీగా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు..

# ఎంత మంది రైతులు బలైపోవాలి

- **రాజధాని ప్రాంతంలో ఇలాంటి రైతు రామారావులు ఇంకా వైసీపీ ప్రశ్నల వర్షం**
- **మంత్రి సమక్షంలోనే కుప్పకూలిన రైతు రామారావు.**




**నేటి సాక్షి, అన్నమయ్య, :** ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి ప్రభుత్వం వైసీపీ లక్ష్యం గా కొత్త వ్యూహాలు అమలు చేస్తోంది. ప్రభుత్వం పైన మాజీ సీఎం జగన్ పోరుబాట ప్రారంభించారు. అమరావతి వేదికగా కొద్ది రోజులుగా ఆసక్తి కర నిర్ణయాలు జరుగుతున్నాయి. తాజాగా అమరావతిలో సమస్యలను ప్రస్తావించిన రైతు రామారావు అస్వస్థతతో మంత్రి సమక్షంలోనే కుప్పకూలారు. ఆస్పత్రికి తీసుకెళ్లే లోగా ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు రైతుల అంశం పైన వైసీపీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామం ఆసక్తి కరంగా మారుతోంది. అమరావతి పైన తొలి నుంచి వ్యతిరేక ముద్ర వేసుకున్న వైసీపీ లో కీలక మార్పు కనిపిస్తోంది. తాజాగా మందడంలో అమరావతి రైతు మంత్రి నారాయణ నిర్వహించిన సభకు హాజరై రోడ్ల విస్తరణ సమస్య పైన స్పందించారు. ఆ వెంటనే అస్వస్థతకు గురయ్యారు. మంత్రి కాన్వాయ్ లోనే ఆస్పత్రికి తరలించే సమయంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన పైన ఇప్పుడు వైసీపీ మంగళగిరి ఇంచార్జ్ దొంతిరెడ్డి వేమారెడ్డి స్పందించారు. రాజధానిలో ఇలాంటి రైతు రామారావులు ఇంకా ఎంతమంది బలైపోవాలంటూ ఆయన ప్రశ్నించారు. సుమారు 30 వేల మంది రైతుల నుంచి భూములు తీసుకున్న ప్రభుత్వం, ఇప్పుడు మళ్లీ భూములు, ఇళ్లు తీసుకుంటామని చెప్పడం దుర్మార్గమని విమర్శించారు. రాజధాని ప్రాంతంలో రైతులను బతకనివ్వకూడదనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. భూమిని లాక్కుంటే రైతు ఎంత వేదన చెందుతాడో పాలకులకు అర్థం కావడంలేదని వ్యాఖ్యానించారు..రైతు రామారావు నుంచి భూమి, ఇల్లు మాత్రమే కాకుండా చివరకు ఆయన ప్రాణం కూడా తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.2.77 లక్షల కోట్ల అప్పులు చేసిన చంద్రబాబు రాజధానిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఒక్క రైతు సమస్యనైనా పరిష్కరించారా అని నిలదీశారు. రైతుల కోసం రూ.15 వేల కోట్లు ఖర్చు చేయలేని ప్రభుత్వం ఏ అభివృద్ధి చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన చంద్రబాబుకు రైతుల బాధలు అర్థం కావా అని ప్రశ్నించారు. భూసమీకరణ సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని, కానీ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. మొదట భూములు ఇచ్చిన రైతులకే న్యాయం చేయలేని చంద్రబాబు మళ్లీ భూసేకరణ చేస్తామని ఎలా చెబుతున్నారని విమర్శించారు. రాజ ధాని పేరుతో రైతుల జీవితాలను పూర్తిగా అగమ్యగోచరం చేశారని ఆరోపించారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతులు కోరుతున్నారని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు ప్రాంతానికి వస్తున్నప్పటికీ ఒక్క సమస్య కూడా పరిష్కారం కావడం లేదని విమర్శించారు. వెంటనే రాజధాని రైతుల సమస్యలను పరిష్కరించాలని దొంతిరెడ్డి వేమారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..

# రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి డివిజన్‌లో శివరాంపల్లి



- **రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌ని ఘనంగా సన్మానించిన**
- **శివరాంపల్లి గ్రామ ప్రజలు**

**(నేటి సాక్షి) రాజేంద్రనగర్ :** రాజేంద్రనగర్ నియోజకవర్గం శివరాంపల్లి గ్రామం జిహెచ్ఎంసి డివిజన్ ల విభజనలో శివరాంపల్లిని సులేమాన్ నగర్ డివిజన్ లో కలపడాన్ని వ్యతిరేకించిన గ్రామస్తులు ఎట్టకేలకు పంతం నెగ్గించుకున్నారు. శివరాంపల్లి గ్రామాన్ని సులేమాన్ నగర్ నుంచి తొలగించి రాజేంద్రనగర్ డివిజన్ లో కలపాలంటూ 300 లకు పైగా ఫిర్యాదులు రావడంతో అధికారులు శివరాంపల్లి గ్రామాన్ని సులేమాన్ నగర్ డివిజన్ నుంచి తొలగించి రాజేంద్రనగర్ డివిజన్ లోకి అధికారులు కలిపారు. శివరాంపల్లి ని రాజేంద్రనగర్ లో కలపడాన్ని స్వాగతించారు. శివరాంపల్లి గ్రామాన్ని రాజేంద్రనగర్ లో కలపడానికి సహకరించిన ఎమ్మెల్యే ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో షాగా ప్రతాపరెడ్డి రాగిశెట్టి యాదిరెడ్డి పెండ్యాల చంద్రమోహన్, పడమటి శ్రీధర్ రెడ్డి మాదురి ప్రభాకర్ రెడ్డి, బండారి శంకర్, దాసరి రమేష్, జీవన్ దాస్, సత్యనారాయణ రెడ్డి, సంజీవరెడ్డి, సదాల నరేందర్ రెడ్డి, చెన్నా రెడ్డి, రణధీర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్ ముదిరాజ్, మోహన్ రావు,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# జగిత్యాల టు ఆంధ్ర

## రూ.6.68 కోట్ల ధాన్యం.. 'వరి కొనుగోలు కేంద్రం' నుంచే తరలింపు

- లారీ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టు వాళ్లకు 'రెడ్ హ్యాండెడ్'గా పట్టుబడ్డ వైనం
- అనుమతి లేకుండా.. ఆంధ్రాకు తరలిన 'సిఎమ్మార్' ధాన్యం
- 'వెంకటాపూర్-బండలింగాపూర్' రైస్ మిల్లర్ల మధ్య రాజుకున్న 281 లారీల 'చే-బదులు' బియ్యం చిచ్చు.?
- సివిల్ సప్లై శాఖ అనుమతి లేకుండా అలా.? ఎలా తరలిస్తారు.?
- జగిత్యాల 'పౌరసరఫరాల శాఖ'లో అంతా ఇష్టారాజ్యం

**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)**

**"జగిత్యాల 'పౌరసరఫరాల శాఖ'లో ఎవరికి పడితే వారు ఇష్టారాజ్యం నడిపిస్తున్నారు. సివిల్ సప్లై అధికారులు చెబితే రైస్ మిల్లర్లు వినాల్సిన చోట.. రైస్ మిల్లర్లు చెబితే సివిల్ సప్లై అధికారులు 'అన్నీ మూసుకుని' గంగిరెద్దుల్లా తలూపుతూ వినే పరిస్థితి దాపురించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఓ 'ఇద్దరు-రైస్ మిల్లర్లు' ఆడుతున్న 'భాగోతం' లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టు వారివల్ల బయటపడింది. తెలంగాణ కాంట్రాక్టుకు చెందిన లారీల్లో లోడ్ కావాల్సిన 'సిఎమ్మార్ ధాన్యం' ఆంధ్రప్రదేశ్ కు చెందిన లారీల్లో లోడ్ అవుతూ 'రెడ్ హ్యాండెడ్'గా పట్టుబడ్డ రైస్ మిల్లర్ల మాయాజాలం వెలుగులోకి వచ్చింది.వరి కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు ఈ ధాన్యం చేరాల్సి ఉండగా.. సరాసరి తెలంగాణ రాష్ట్రం దాటిపోతుండం మిల్లర్ల అసలు బండారం బయట పడ్డట్టైంది. 2025-26 ఖరీఫ్ సీజన్ కు చెందిన 281 లారీల ధాన్యం అసలు మాయమైంది 'ఆ - రెండు' రైస్ మిల్లుల్లో కాదని..'వరి కొనుగోలు కేంద్రం'లోనే వీరి బాగోతం బట్టబయలైందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.తెలంగాణ వరి కొనుగోలు కేంద్రంలో 'సీఎమ్మార్' తీగ లాగితే.. ఆంధ్రాలోని 'రైస్ స్కామర్ల' డొంక కదిలే అవకాశాలున్నాయని తెలుస్తోంది"**

### 'మైకా'సురుల మాటలు.. 'ఊక'దంపుడు ఉపన్యాసాలేనా?

రైతుల నుంచి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లుకు చేర్చకుండా.. డైరెక్ట్‌గా వరి కొనుగోలు కేంద్రం నుంచి ఆంధ్రాకు తరలించుకుపోతున్న వైనం విస్మయపరుస్తోంది. రైతు నుంచి 'చివరి గింజ వరకు కొంటాం..' అని ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెప్పుకుంటారు మైకుల్లో.! దీన్ని తు.చ. తప్పకుండా జిల్లా కలెక్టర్‌లు.. సివిల్ సప్లై అధికారులు వరి కొనుగోలు కేంద్రాలను పలుమార్లు సందర్శిస్తూ నిర్వాహకులకు వార్నింగ్ ఇస్తూంటారు. గన్నీ సంచుల కొరత ఉండొద్దని.. లారీలు అందుబాటులో ఉండాలని.. రైస్ మిల్లర్లు వెంటదివెంట మిల్లుల్లో దించుకోవాలని.. రైతులకు ఎప్పటికప్పుడు ధాన్యం డబ్బులు వారి ఖాతాలకు జమ చేయాలని 'పౌరసరఫరాల శాఖ' అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశిస్తుంటారు జిల్లా కలెక్టర్లు.! ఎమ్మెల్యేలు.. ఎంపీలు.. మినిస్టర్లు.. ఇంకొంచెం ఎక్కువగా రియాక్టవుతూ 'ధాన్యం' కొనే విధంగా తమతమ 'ఐడియాలజీ'లను మైకుల్లో ఊదరగొడుతూ 'రాజకీయ పబ్బం' గడుపుతుంటారు. కానీ..ఇందులో ఏ ఒక్కరూ 'సివిల్ సప్లై శాఖ'లో అసలు ఏం బాగోతాలు నడుస్తున్నాయని తొంగి చూడకపోవడం దురదృష్టకరం.!

### రైస్ మిల్లర్లదే ఇష్టారాజ్యం.!

2022-23 రబీ సీజన్.. 23-24 ఖరీఫ్ సీజన్.. 23-24 రబీ సీజన్.. 24-25 ఖరీఫ్ సీజన్.. 24-25 రబీ సీజన్‌లలో 'సీఎమ్మార్' ధాన్యాన్ని పక్కదారి పట్టించి కోట్లు దండుకున్న 'రైస్ మిల్లర్ల మాఫియా' అధికారులను.. ప్రభుత్వ పెద్దలను 'కొనేసి' తమ గుప్పిట్లో పెట్టుకొని 'పౌరసరఫరాల శాఖ'లో ఇష్టారాజ్యం నడిపిస్తున్నారు. సివిల్ సప్లై అధికారులకు నచ్చని వారి మిల్లులపై.. అసోసియేషన్ చెప్పిన వారిపై 'ఫిజికల్ వెరిఫికేషన్' పేరిట ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ కేసులు చేస్తుంటారని ప్రచారం జరుగుతోంది.ఇందులో ఏ రైస్ మిల్లులో 'ధాన్యం లెక్కల్లో తేడాలు' ఉన్నాయని తేలుతాయో ఆ మిల్లర్లపై కేసులు పెడుతుంటారు.'వారి రేటు ప్రకారం'.. తనిఖీ అధికారుల జేబులు నింపితే సరి.! లేదంటే..సీజ్.. ధాన్యం కేటాయింపులు బ్రేక్.! దీంతో కొందరు 'డిఫాల్ట్ రైస్ మిల్లర్లు' సిండికేట్ గా మారి అధికారులను తమకు అనుకూలంగా మార్చుకుని 'సిఎమ్మార్ ధాన్యాన్ని' దారి మళ్లించి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు.అంటే.! ఈ దోపిడీ అధికారులకు తెలిసే ఇదంతా జరుగుతోందన్నది సుస్పష్టం.! ఇందులో భాగంగానే అనుమతి లేకుండా 'ఆంధ్రా'కు తరలి వెళుతున్న ధాన్యం పట్టుబడ్డ వైనం చాటి చెబుతోంది.!

### అసలు 'పంచాయతీ' ఇదీ.!

వాసవీ రైస్ మిల్లర్..భవానీ రైస్ మిల్లర్ కు 3 ఏసీకేల బియ్యం బకాయిపడ్డాడు. గత సీజన్ లలో 'గోల్ మాల్' చేసుకున్న 'సీఎమ్మార్' బియ్యాన్ని పౌరసరఫరాల శాఖకు తిరిగి చెల్లించే క్రమంలో వీరిద్దరు పలుమార్లు పరస్పరం సహకరించుకుంటూ వచ్చారు.ఈ క్రమంలో వీరిద్దరి మధ్య '3 ఏసికేల బియ్యం' వ్యవహారం చిచ్చు రగిలింది.బియ్యానికి బదులు తనకు వడ్లు కేటాయించుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారట.

### ఆ-3 ఏసీకేల ధాన్యం పట్టుబడింది ఇలా..!

కోరుట్ల మండలం వెంకటాపూర్ లో గల 'వాసవి రైస్ మిల్లర్'కు చెందిన 216 లారీల ధాన్యం.. మెట్ పల్లి మండలం బండలింగాపూర్ లోని 'భవానీ రైస్ మిల్లర్'కు చెందిన 65 లారీల ధాన్యం జగిత్యాల జిల్లాలోని ఓ 'వరి కొనుగోలు కేంద్రం' నుంచి 'ఆంధ్రా'కు తరలించారు.ఈ ధాన్యం ఆ రెండు రైస్ మిల్లులకు తరలించాల్సి ఉండగా ఆంధ్రాకు పక్కదారి పట్టింది.ఇదేలా బయటకు పొక్కిందంటే.? వరి కొనుగోలు కేంద్రంలో 'ఆంధ్రా'కు చెందిన లారీలు కనిపించడంతో..మా తెలంగాణా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టుకు చెందిన లారీల్లో లోడ్ కావాల్సిన 'సిఎమ్మార్ ధాన్యం' వారి లారీల్లో ఎలా చేస్తున్నారని కొనుగోలు కేంద్రంలో ఉన్న నిర్వాహకులను నిలదీయడంతో అసలు బండారం బయట పడింది. బండలింగాపూర్ లోని 'భవానీ రైస్ మిల్లర్'..వెంకటాపూర్ 'వాసవీ రైస్ మిల్లర్' పేరిట జగిత్యాల జిల్లా డిటీ శ్రీనివాస్ ద్వారా 'అలాట్ మెంట్' తీసుకుని.. ఆ ధాన్యాన్ని ఆంధ్రాకు తిరిగి వెళ్లే లారీలను ఈ వరి కొనుగోలు కేంద్రంలోకి తెచ్చి 3 ఏసికేల ధాన్యాన్ని లోడ్ చేయించారని తెలిసింది. అంటే.?అది రూ.6 కోట్ల 68 లక్షల 78 వేల విలువైన ధాన్యమన్నట్టు. దీంతో తెలంగాణ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టు వాళ్లు 'భవానీ రైస్ మిల్లర్'ను నిలదీస్తే.. ఆంధ్ర వాళ్లకు నష్టం వస్తే నేను భరించుకుంటా మీకేంపట్టి అంటూ 'పత్రికల్లో ప్రచూరించని భాష'లో బండబూతులు తిట్టి పంపించినట్టు సమాచారం. ఈ క్రమంలో ఈ 'పంచాయతీ' అనూహ్య మలుపులు తిరిగింది. వెంటనే వారు జిల్లా కలెక్టర్ కో..అదనపు కలెక్టర్ కో..లేదా సివిల్ సప్లై అధికారులకో ఫిర్యాదు చేసినట్టు సమాచారం.



### 'ఫిజికల్ వెరిఫికేషన్'లో ధాన్యం లెక్కల్లో తేడాలు

తెలంగాణ ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టు వాళ్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సివిల్ సప్లై డిఎం జితెందర్ తన సిబ్బందితో ఇటు వెంకటాపూర్ లోని 'వాసవీ రైస్ మిల్లు'లో..అటు బండలింగాపూర్ లోని 'భవానీ రైస్ మిల్లు'లో 'ఫిజికల్ వెరిఫికేషన్'లో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తమ తనిఖీల్లో తాము ఇచ్చిన ధాన్యం లెక్కల్లో తేడాలున్నట్టు గుర్తించారు. 'ఆ వరి కొనుగోలు కేంద్రం'లో నుంచి ఆంధ్రాకు తరలించుకుపోతున్న ధాన్యం నిజమేనని నిర్ధారించుకుని తగు నివేదికలను సివిల్ సప్లై శాఖ ఉన్నతాధికారి ( డిసిఎస్ఓ ) జితెందర్ రెడ్డికి సమర్పించినట్లు తెలియవచ్చింది.ఈ లెక్కన జగిత్యాల జిల్లాలో ప్రభుత్వానికి బకాయి పడ్డ సిఎమ్మార్ ధాన్యం అంతా ఇదే పద్ధతిన పక్కదారి పట్టి..పక్క రాష్ట్రాలకు తరలివెళ్లి 'పోయిందన్నది' నిజమేనని తేలింది.

### ఇందులో ఏ అధికారి పాత్ర ఎంత.?

జగిత్యాల జిల్లా టు ఆంధ్రాకు వయా వరి కొనుగోలు కేంద్రం నుంచి తరలివెళ్లిన ధాన్యం స్కాంలో ఘనత వహించిన 'పౌరసరఫరాల శాఖ'లో ఏ అధికారి పాత్ర ఎంత ఉందో నిగ్గు తేల్చాల్సిన అవసరముంది.కొనుగోలు కేంద్రం నుంచి రైస్ మిల్లులకు చేరాల్సిన ధాన్యం పక్క రాష్ట్రాలకు అనుమతి లేకుండా అలా.?ఎలా తరలిపోతుంది.? సివిల్ సప్లై శాఖ అధికారుల్లో ఎవరి పాత్ర లేనిదే.. 'అలాట్ మెంట్'ఎవరు చేశారు.? వారికి తెలీకుండా 'ట్యాగింగ్' ఎలా జరుగుద్ది.? ఎంత ధైర్యముంటే మిల్లు లోంచి కాకుండా డైరెక్ట్ కొనుగోలు కేంద్రం నుంచి ఆంధ్రాకు ఎలా తరలిపోతుందీ.? అంటే.? సివిల్ సప్లై శాఖ అధికారుల పాత్ర లేనిదే 'గింజ కూడా' ఎక్కడికీ పోదు.! మరి 281 లారీ ధాన్యం ఎలా మాయమవుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.మళ్లీ 'ఏం తెల్వని ఎల్లిపాయె.. గురిగిలేస్తె కరిగిపాయె' అన్నట్టు తనిఖీలోటీ.!

### పౌరసరఫరాల శాఖ అధికారులు మధ్య రగడ?

గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న 'సీఎమ్మార్' ధాన్యం మాయం వ్యవహారం ఇప్పుడు 'పౌరసరఫరాల శాఖ'లోని అధికారుల మధ్య చిచ్చు పుట్టి చినికి చినికి గాలివానగా'మారుతోందని తెలిసింది. ఫిజికల్ వెరిఫికేషన్ లో ధాన్యం లెక్కల్లో తేడాలున్నట్టు..గుర్తించామని.. వరి కొనుగోలు కేంద్రం నుంచి ఆంధ్రాకు తరలించుకుపోతున్న ధాన్యం నిజమేనని నిర్ధారించుకుని నివేదికను ఇచ్చామని జగిత్యాల డిఎం జితెందర్ తన ఉన్నతాధికారి డిసిఎస్ఓ జితెందర్ రెడ్డికి సమర్పించి 'ఆ-ఇద్దరు' రైస్ మిల్లర్లపై కేసులు పెట్టాలనడంతో వాగ్వివాదం చోటుచేసుకుందని బయట ప్రచారం జరుగుతోంది.ఇంత 'రెడ్ హ్యాండెడ్'గా పట్టుబడ్డా కూడా చర్యలు చేపట్టకుండా ఇంకా మీనమేషాలు లెక్కించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు.

### ఆ అధికారి ప్రతీ పనికో 'రేటంటా'?

ప్రస్తుతం ఉన్న ఉన్నతాధికారి రైస్ మిల్లర్లు చేస్తున్న మాయాజాలం గమనించి..వారి నుంచి అడ్డగోలుగా కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని విపరీతంగా ప్రచారం జరుగుతోంది.మిల్లుకో రేటు..ప్రతీ పనికో రేటు ఫిక్స్ చేసినట్టు వెలుగులోకి వచ్చింది.ఈ వసూళ్లు 'అసోసియేషన్' ద్వారానే ముట్టజూసుకుంటున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. తమ మిల్లుకు ధాన్యం కేటాయింపులు జరగాలన్నా.?.. ధాన్యం తనిఖీల్లో తేడాలున్నాయని నివేదిక వచ్చినా.?.. కేసులు నమోదు చేయకుండా ఉండాలన్నా.?..డిఫాల్టరైయుండి మళ్లీ ధాన్యం కేటాయింపులు కావాలన్నా.?..రంగుమారిన బియ్యం కొనలాన్నా.?.. పెండింగ్ బకాయిలపై మభ్యపెడితే చర్యలు ఆగిపోవాలన్నా.? ఎన్ని బాగోతాలాడినా.. ఎలాంటి చర్యలు ఉండకుండా..సదరు 'అయ్యగోరు' ఫిక్స్ చేసిన ప్రతీ పనికో రేటు ప్రకారం' ముల్లెలు ముట్టజెప్పాల్సిందేనని 'రైస్ మిల్లర్ల' మధ్య టాకు.! గతంలో ఇక్కడ పనిచేసిన పెద్దయ్యగారి కంటే పదిరెట్లు ముల్లెలు మూటగట్టుకున్నట్టు మిల్లర్లు బాహాటంగానే ముచ్చటించుకుంటున్నారు.అయితే.! ఇటీవలే పక్కనే ఉన్న 'నిర్మల్ జిల్లా కలెక్టర్' ఇలాంటి దొంగ అధికారులైన డీసిఎస్ఓ..డీఎం..డీటీ'లను ముగ్గురినీ సస్పెండ్ చేసి సంచలనం సృష్టించారు.ఆ దొంగ రైస్ మిల్లర్లకు సీఎమ్మార్ కేటాయింపులు జరుగకుండా నిషేధం విధించారు.ఇదే విధంగా జగిత్యాల జిల్లాలో ఇంత 'రెడ్ హ్యాండెడ్'గా పట్టుబడ్డా కూడా నా వెంట్రుక కూడా పీకలేరు..మాపై ఎన్ని వార్తలు రాసుకున్నా ఫరాక్ పడేందేం లేదని 'అహంకార ధోరణి' పదర్శిస్తున్నట్టు తెలిసింది.ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరెందర్ రెడ్డి..మావోడు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా కులపోడు..మీరెంత అఫ్ట్రాల్ జూజుబీలని ..'ఆయన్ని కలిసిన కొందరు రైస్ మిల్లర్లకు డైరెక్ట్ వార్నింగ్'లు ఇస్తున్నట్టు బయటకు పొక్కింది. జగిత్యాల జిల్లాకు ఓ మంచి కలెక్టర్ వచ్చాడని ఇప్పటిదాకా పాజిటివ్ టాక్ ఉంది.ఇదంతా ఆయన దృష్టికి వెళితే.. అహంకారం గెలుస్తుందో.. ఐఏఎస్ గెలుస్తారో..'అయ్యవారు' రంగంలోకి దిగితే గాని తెలీదు.. సో.! ఏం జరుగుతుందో వెయిట్ అండ్ సీ.!!





నేటి సాక్షి
TGTEL/25/A1737
కరీంనగర్ | ఆదివారం 28 డిసెంబర్ 2025

# సంక్రాంతికి సందడి చేయనున్న చిరు, వెంకీ



## ఆర్ యూ రెడీ సాంగ్ ప్రోమో విడుదల

'ఆర్ యూ రెడీ' అంటూ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు అగ్రకథానాయకులు చిరంజీవి, వెంకటేశ్. అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి హీరోగా నటిస్తోన్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. వెంకటేశ్ అతిథిపాత్రలో సందడి చేయనున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా 'ఆర్ యూ రెడీ' అంటూ సాగే పాట ప్రోమోను తాజాగా విడుదల చేశారు. ఈ పూర్తిపాట డిసెంబర్ 30న రానుంది. అగ్ర కథానాయకులు చిరంజీవి, వెంకటేశ్ కలిసి స్టెప్పేస్తే.. థియేటర్లలో ప్రేక్షకుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడా అపురూప ఘట్టాన్ని 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంతో తెరపై చూపించనున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఆయన దర్శకత్వంలో చిరంజీవి - నయనతార జంటగా నటించిన ఈ సినిమాని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించారు. వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఇందులో చిరు - వెంకీ కలయికలో ఓ పాట తెరకెక్కించినట్లు ఇప్పటికే తెలిపారు. ఇప్పుడా 'మెగా విక్టరీ మాస్ గీతం'ను ఈనెల 30న బయటకు వదలనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. అందులో చిరంజీవి, వెంకటేశ్ స్టైలిష్ లుక్స్‌లో.. హుషారుగా స్టెప్పేస్తూ కనిపించారు. ఈ వినోదాత్మక కుటుంబ కథా చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న థియేటర్లలోకి రానుంది. దీనికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు.

# కూలీపై విమర్శలు స్వాగతించిన లోకేశ్ కనగరాజ్



తన గత చిత్రంపై చాలా విమర్శలు వచ్చాయని వాటిని సరిదిద్దుకుంటానని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ అన్నారు. రజనీకాంత్ హీరోగా ఆయన తెరకెక్కించిన చిత్రం 'కూలీ'. ఈ ఏడాది ఆగస్టులో ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా గురించి లోకేశ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. దీని విడుదల సమయంలో వచ్చిన విమర్శల గురించి ప్రస్తావించారు. కూలీ' సినిమాపై ఎన్నో విమర్శలు వచ్చాయి. నేను తర్వాత తీయనున్న చిత్రంలో వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తాను. అన్ని ట్రోల్స్ వచ్చినప్పటికీ ప్రేక్షకులు రజనీకాంత్ కోసం సినిమా చూశారు. దీనికి రూ.500 కోట్లు వచ్చాయని నిర్మాతలు చెప్పారు. ఈ విషయంలో అందరికీ ధన్యవాదాలు చెప్పాలి. నేను అంచనాల ఆధారంగా కథలు రాయలేను. రాసుకున్న కథలోని పాత్రలు ప్రేక్షకుల అంచనాలు అందుకుంటే ఆనందిస్తాను. ఒకవేళ అలా అందుకోలేకపోతే.. తర్వాత సినిమాలో అయినా వాటికోసం ప్రయత్నిస్తాను' అని తెలిపారు. రజనీకాంత్, నాగార్జున, శ్రుతి హాసన్, సత్యరాజ్, ఉపేంద్ర, ఆమిర్ ఖాన్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా రజనీ తన మార్క్‌తో అలరించారు. 'వార్ 2'తో పోటీపడిన ఈ మూవీ రూ.500 కోట్లు వసూలు చేసింది. స్నేహితుడి ఆకస్మిక మరణం వెనక కారణాలను తెలుసుకునే దేవ పాత్రలో రజనీకాంత్ కనిపించారు.



# ఛాంపియన్ ప్రతి ఒక్కరూ మెచ్చే సినిమా

కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా 'ఛాంపియన్ అన్నారు హీరో రోషన్. ఈ చిత్రం యదార్థగాధలకు ప్రతిరూపం అన్నారు. రోషన్,. అనస్వర రాజన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ప్రదీప్ అద్వైతం తెరకెక్కించారు. స్వప్న దత్, జీకే మోహన్, జెమినీ కిరణ్ నిర్మించారు. నందమూరి కల్యాణ్ చక్రవర్తి ముఖ్య పాత్ర పోషించారు. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. 'ఛాంపియన్' నాకెంతో ప్రత్యేకమైన సినిమా అన్నారు హీరో రోషన్. 'ఇది పిల్లలతో కలిసి చూడాల్సిన చిత్రం. ఇది ప్రతి ఒక్కరికీ నచ్చింది' అన్నారు దర్శకుడు ప్రదీప్ అద్వైతం. ఈ కార్యక్రమంలో నందమూరి కల్యాణ్ చక్రవర్తి, స్వప్న దత్, జెమినీ కిరణ్, జీకే మోహన్, అనస్వర రాజన్, మిక్కీ జే మేయర్, రచ్చ రవి, సంజయ్ బలగం, యశ్ తదితరులు పాల్గొన్నారు.



# సహనా..సహనా సాంగ్ కొత్తగా చూపారు

## రాజాసాబ్ సాంగ్‌పై నిధి అగర్వాల్

ప్రభాస్‌తో కలిసి 'ది రాజాసాబ్' అంటూ సందడి చేసేందుకు నిధి అగర్వాల్ సిద్ధమయ్యారు. వీరిద్దరి కాంబోలో తెరకెక్కిన ఈ సినిమా జనవరి 9న విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా నిధి వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు. రాజాసాబ్ విడుదలయ్యాక నా అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి చెబుతాను. తెలుగులో మూడు సినిమాలు చేస్తున్నా. ఇతర భాషల్లోనూ కొన్నిటికి సైన్ చేశా. 2026 మొత్తం బిజీనే. నాకు ఓటీటీ సినిమాలంటే ఇష్టం. డైరెక్ట్ ఓటీటీ ప్రాజెక్ట్‌లు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా. మంచి కథ ఉంటే కచ్చితంగా చేస్తా. 2025లో రెండు ప్రత్యేక అనుభవాలు ఉన్నాయి. రాజాసాబ్ షూటింగ్, 'హరి హర వీరమల్లు' ప్రచార సమయంలో పవన్ నన్ను ప్రశంసించడం ఎప్పటికీ మర్చిపోలేనని నిధి చెప్పారు. ఇకపోతే రాజాసాబ్‌లో ఈ సినిమాలో ప్రతిఒక్కరి పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రభాస్ 6.2 అడుగులు, నేను 5.7 అడుగులు.. ఆయన హైట్‌ను బ్యాలెన్స్ చేయడం కోసం పెద్ద హీల్స్ వేసుకుని యాపిల్ బాక్స్‌లపై నిల్చున్నా. సహనా సహనా సాంగ్‌ను స్క్రీన్‌పై కొత్తగా చూస్తారు. కాస్ట్యూమ్స్ చాలా కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. తెర పైనే కాదు.. నిజజీవితంలోనూ ప్రభాస్ స్వీట్ పర్సన్. నా కెరీర్‌లో అంత మంచి వ్యక్తిని చూడలేదు. ఆయన అతిథి మర్యాదల గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఇంటి నుంచి భోజనం తెప్పిస్తారు. నేను విరామ సమయంలో కుటుంబంతో గడుపుతాను. ధ్యానం చేసుకుంటా. సామాజిక సేవ కూడా చేస్తాను. కానీ, దాని గురించి బయటకు చెప్పడం నాకు ఇష్టం లేదు. విదేశాల్లో షూటింగ్‌కు వెళ్లినప్పుడు చిన్న గ్యాస్ సిలిండర్ వెంట తీసుకెళ్తాను. ప్రతిరోజు టిఫిన్, డిన్నర్ నేనే వండుకుంటాను అని వెల్లడించారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: 9119949944, 966605221